ప్రజావీక్షణం దినపత్రిక
విలేకర్లు కావలెను
అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో
ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ
ప్రజల పక్షాన నిలబడాలని అనుకుంటున్నారా.?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా.?
అయితే రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..
తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా
జిల్లాలు, మండలాల వారీగా నిబద్దతతో
పని చేసే విలేకరులు కావలెను
PJV ప్రజా వీక్షణం టీవీ
9866330400


# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :283 06 ఆదివారం సెప్టెంబర్ 2026 పేజీలు : 08 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari


PJV ప్రజా వీక్షణం టీవీ
Subscribe

## ఉపాధ్యాయుల కంటతడి ఏ దేశానికి, ఏ రాష్ట్రానికి మంచిది కాదు: బండి సంజయ్

- ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపిన బండి సంజయ్
- ఉపాధ్యాయులు అర్థాకలితో అలమటిస్తున్నారని ఆవేదన
- ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్



ఉపాధ్యాయుల కన్నీళ్లతో ఏ దేశం కానీ, రాష్ట్రం కానీ బాగుపడదని, ఈ పచ్చి నిజాన్ని కాంగ్రెస్ పాలకులు తక్షణమే గ్రహించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అర్థాకలితో అలమటిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న గురువులందరికీ శుభాకాంక్షలు తెలిపుతున్నానని అన్నారు. రాష్ట్రంలో పీఆర్సీ అమలు కాకపోయినా, డీఏలు ఇవ్వకపోయినా ఓర్పుతో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని కొనియాడారు. బడినే సర్వస్వంగా భావించి కొవ్వొత్తిలా కరిగిన రిటైర్డ్ టీచర్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక మలిసంధ్యలో ఆఫీసుల చుట్టూ కాళ్లకు చెప్పులరిగేలా తిరగడం అత్యంత విచారకరమన్నారు.

## కొండా సురేఖ స్థానంలో ఎవరు?..

### కేబినెట్ విస్తరణపై పీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు

- కేబినెట్ విస్తరణపై మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు
- ఢిల్లీ పర్యటనలో విస్తరణపై చర్చ జరగలేదన్న పీసీసీ చీఫ్
- కొండా సురేఖ బర్తరఫ్ ఏఐసీసీ నిర్ణయమని స్పష్టీకరణ
- కేబినెట్ విస్తరణకు హైకమాండ్ నుంచి సమాచారం లేదని వెల్లడి
- విస్తరణ ఎప్పుడు చేయాలనేది సీఎం నిర్ణయమన్న మహేశ్



కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించిన నేపథ్యంలో తెలంగాణ కేబినెట్ విస్తరణపై జోరుగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం కేబినెట్ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఇటీవల తాను ఢిల్లీ వెళ్లినప్పుడు మంత్రివర్గ విస్తరణ అంశం ప్రస్తావనకు రాలేదన్నారు. కొండా సురేఖ, చిన్నారెడ్డికి సంబంధించిన అంశాలపైనే అధిష్ఠానంతో చర్చ జరిగిందని తెలిపారు. ...మిగతా 2 లో...

## కేసీఆర్ కు పట్టిన గతే రేవంత్‌కూ పడుతుంది:

- 22ఏ నిషేధిత భూముల జాబితాపై రాంచందర్ రావు విమర్శలు
- ధరణి పేరుతో ప్రజలను పీడించిన కేసీఆర్ ప్రభుత్వం ఓటమిపాలైందని ఆరోపణ
- రేవంత్ కూడా అదే బాటలో పయనిస్తూ తన గోతిని తానే తవ్వుకుంటున్నారని వ్యాఖ్య



సామాన్యుల ఆస్తులు, రైతుల పొలాలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం భూదందా సాగిస్తోందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు. 22ఏ నిషిద్ధ జాబితా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల సొంత భూములను లాక్కునేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో ఈరోజు జరిగిన మహాధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల భూములపై పడ్డ ఏ పాలకుడు చరిత్రలో బాగుపడలేదని హెచ్చరించారు. ...మిగతా 2 లో...



## రేవంత్ రెడ్డి ఇంటికి ఒక న్యాయం.. ప్రజలకు మరో న్యాయమా?: రఘునందన్ రావు

- సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ బాధితుల సమావేశం
- 12 ఏళ్ల కిందటి కాలనీని 22ఏ లో చేర్చారన్న రఘునందన్ రావు
- ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్

రూపాయి రూపాయి కూడబెట్టుకుని నిర్మించుకున్న ఇళ్లను రాత్రికి రాత్రి 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ దారుణ నిర్ణయమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ భూముల సమస్యపై ఏర్పాటు చేసిన సమా వేశానికి ఆయన హాజరయ్యారు. అన్ని ప్రభుత్వ శాఖల అనుమతులతో 55 ఎకరాల్లో 1,500 ఇళ్ల నిర్మాణం జరిగి 12 ఏళ్లు గడుస్తోందని... ఇప్పుడు ఉన్నట్టుండి ఆ ఇళ్లను నిషేధిత జాబి తాలో పెట్టడంపై కాలనీవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. బాధితుల పక్షాన పోరాడతానని హామీ ఇచ్చారు.

...మిగతా 2 లో...

## కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

- వెయ్యి రోజులుగా సభకు రాకుండా జీతం తీసుకుంటున్నారని ఆరోపణ
- కేసీఆర్ వైఖరికి నిరసనగా 6న ఇందిరా పార్క్ వద్ద కాంగ్రెస్ మహా ధర్నా
- ధర్నాలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనను వివరిస్తామన్న మంత్రులు
- సన్నాహక సమావేశంలో పాల్గొన్న మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు" అని ఆరోపించారు.కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇదే వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# విద్యాశాఖలో కీలక మార్పులు...

## - టీచర్ల సమస్యలపై సీఎం రేవంత్ హామీ

- పెండింగ్ టీచర్ల పదోన్నతులు పూర్తి చేశామన్న రేవంత్
- బదిలీలపై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామన్న సీఎం
- రెండేళ్లలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ
- సాంకేతిక విద్యకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్న రేవంత్
- పాలిటెక్నిక్ విధానంలో మార్పులు లేవని స్పష్టీకరణ



విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకొస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేశామని చెప్పారు. టీచర్ల బదిలీల విషయంలోనూ ప్రభుత్వం ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తోందన్నారు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు.తల్లిదండ్రులతో సమానంగా పిల్లల భవిష్యత్తుకు పునాది వేసేది ఉపాధ్యాయులేనని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్ల సమయం ఇస్తే సమస్యలను పరిష్కరించి చూపిస్తానన్నారు. ...మిగతా 2 లో...



## లక్కీ లాటరీ సీఎం రేవంత్‌ను కూల్చే రోజులు త్వరలోనే ఉన్నాయి: కేటీఆర్

- రేవంత్ ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అన్న కేటీఆర్
- 420 మోసాలకు గాను రేవంత్ 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్
- మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని ఆరోపణ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ యువతకు స్కిల్ లేదనడానికి రేవంత్ రెడ్డికి ఏ అర్హత ఉందని, ఆయన స్వయంగా ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మోసాలపై బీఆర్ఎస్ నిర్వహించిన 'యువభేరి' సభలో పాల్గొన్న కేటీఆర్, కేవలం లక్కీ లాటరీ తగలడం వల్లే రేవంత్ సీఎం అయ్యారని ఎద్దేవా చేశారు.

...మిగతా 2 లో...

## సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు?: రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం...

- వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- సమస్యలను గాలికొదిలేసి వేడుకలు జరుపుకుంటున్నారంటూ హరీశ్ విమర్శ
- ప్రభుత్వం కుంభకోణాలమయం అయిందని ఆరోపణ



కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన వేడుకలను జరుపుకోవడంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకుని సంబరాలు చేసుకుంటోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల తీరు 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అన్న చందంగా తయారైందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగిస్తున్న పరిపాలనా విధానాన్ని, ఆయన పనితీరును ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కుంభకోణాలమయంగా మారిపోయిందని హరీశ్ రావు ఆరోపించారు. హామీలు నెరవేర్చడంలో విఫలమైన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని తాము డిమాండ్ చేస్తుంటే, బాధ్యతారాహిత్యంగా కేసీఆర్ రాజీనామా చేయాలనడం విడ్డూరంగా ఉందన్నారు. రాజీనామా చేయాల్సింది కేసీఆర్ కాదని, ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డేనని తేల్చిచెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగుల ఆవేదన, జీఓ 97 రద్దు, రైతాంగానికి నమ్మకమైన ఉచిత విద్యుత్ సరఫరా వంటి కీలక ప్రజా సమస్యలే ఎజెండాగా రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ గళమెత్తుతుందని తెలిపారు. సభలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు అధినేత కేసీఆర్ బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పూర్తి దిశానిర్దేశం చేస్తారని హరీశ్ రావు స్పష్టం చేశారు.

## యూపీలో మసీదు కూల్చివేత..

### తెల్లవారుజామున చర్యపై అసదుద్దీన్ ఒవైసీ, అఖిలేశ్ ఫైర్

- యూపీలోని సహారన్‌పూర్‌లో అక్రమ నిర్మాణమంటూ మసీదు కూల్చివేత
- తెల్లవారుజామున ఐదు గంటలకే చర్యలు చేపట్టడంపై చెలరేగిన వివాదం
- యోగి ప్రభుత్వ తీరుపై ఒవైసీ, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ తీవ్ర విమర్శలు
- హైకోర్టుకు వెళ్లకుండా అడ్డుకునేందుకే ఈ చర్యలని ప్రతిపక్షాల ఆరోపణ
- ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నామన్న అధికారులు, శాంతికి విజ్ఞప్తి



ఉత్తరప్రదేశ్‌లోని సహారన్‌పూర్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న మసీదును అధికారులు కూల్చివేయడం రాజకీయ ప్రకంపనలకు దారితీసింది. శనివారం తెల్లవారుజామున ఐదు గంటలకు ఈ చర్య చేపట్టడంపై మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యోగి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించిందని వారు ఆరోపించారు. ...మిగతా 2 లో...

ప్రజావీక్షణం
దినపత్రిక

# సింగరేణి కార్మికులపై వేధింపులు ఆపాలి

- టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నిరసన హోరు
- సస్పెన్షన్లు, ఛార్జ్ షీట్లు వెంటనే రద్దు చేయాలి
- కార్మికుల జోలికొస్తే ఊరుకునేది లేదు
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హెచ్చరిక

**ప్రజా వీక్షణం ,గోదావరిఖని:**

సింగరేణి వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్), బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిరసన హోరు మిన్నంటింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఆర్జీ-1 ఏరియాలోని జిడికే 2 ఎ 2వా ఇన్క్లైన్ వద్ద ఈ నిరసన ధర్నా చేపట్టారు. వద్దేపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్మికులపై జారీ చేసిన ఛార్జ్ షీట్లు, సస్పెన్షన్లు, డిస్మిసల్స్ వెంటనే రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. సింగరేణి రికార్డుల్లో పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలని, కారుణ్య మరియు డిపెండెంట్ ఉద్యోగాల నియామకాలను పునరుద్ధరించాలని కోరారు. ఖాళీల ఆధారంగా అర్హులైన కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వాలని, 60 ఏళ్లు దాటిన వారికి బకాయిలతో కూడిన పింఛన్ మంజూరు చేయడంతో పాటు క్రమం తప్పకుండా మెడికల్ బోర్డులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడుస్తున్నా కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని




నెరవేర్చలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన 250 గజాల ఇండ్ల స్థలాలు, 100 శాతం ఇన్వాలిడేషన్ ఉద్యోగాలు, ఇన్‌కమ్ టాక్స్ మినహాయింపు వంటి వాగ్దానాలను పూర్తిగా విస్మరించి కార్మికులను మోసం చేశారని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ పాలనలో 19,000 మందికి ఉద్యోగాలు కల్పించడమే కాకుండా, మెడికల్ కాలేజీల్లో కార్మికుల పిల్లలకు 5 శాతం కోటా ఇచ్చామని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కొత్తగా ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా, కార్మికులను వేధిస్తూ సస్పెన్షన్లు, ఛార్జ్ షీట్లతో తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదని, పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ?ఈ కార్యక్రమంలో మాదాసి రామ్మూర్తి, నూనె కొమరయ్య, ఉప్పులేటి తిరుపతి, మీస రాజు, దూత శేషగిరి, మేకల సమ్మయ్య, మూల విజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యాశాఖలో కీలక మార్పులు...

మొదటిపేజీ తరువాయి

తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం చెప్పారు. సాంకేతిక విద్యకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యావిధానంలో ఎలాంటి మార్పులు చేయడం లేదని స్పష్టం చేశారు.విద్యాశాఖ కమిషన్ ద్వారా అనేక సమస్యలను పరిష్కరిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్సీ సమస్యను పరిష్కరించామని చెప్పారు. ఇటీవల ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేయడం తనకు చాలా బాధ కలిగించిందన్నారు.కార్యక్రమానికి ముందు కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.

## లక్కీ లాటరీ సీఎం రేవంత్‌ను కూల్చే రోజులు త్వరలోనే ఉన్నాయి: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

ప్రధాని మోదీనే గడగడలాడించిన తెలంగాణ యువశక్తికి రేవంత్ రెడ్డి ఓ లెక్కే కాదన్నారు. ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ పేరిట పెద్ద పెద్ద మాటలు చెప్పిన కాంగ్రెస్ నేతలు, అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు ఇవ్వడం మానేసి లూటీఫికేషన్‌లు నడుపుతున్నారని మండిపడ్డారు.ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలంటున్న కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా, లేక ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించిన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. ప్రజలకు చేసిన 420 రకాల మోసాలకు గానూ రేవంత్ రెడ్డి 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు రాబోతున్నాయని హెచ్చరించారు. మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తమ ప్రభుత్వం 2.32 లక్షల ఉద్యోగాలు ఇస్తే, ఈ వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చినవి కేవలం 16 వేల ఉద్యోగాలేనని చెప్పారు. ఉద్యోగాల కల్పనపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

## రేవంత్ రెడ్డి ఇంటికి ఒక న్యాయం.. ప్రజలకు మరో న్యాయమా?: రఘునందన్ రావు

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసాన్ని ఏ దరఖాస్తు ఆధారంగా 22ఏ జాబితా నుంచి తొలగించారో, అదే నిబంధనలను సామాన్య ప్రజల ఆస్తులకు కూడా వర్తింపజేసి వెంటనే తొలగించాలని ఎంపీ రఘునందన్ రావు సూటిగా నిలదీశారు. కేవలం సాంకేతిక తప్పు జరిగిందని రెవెన్యూ మంత్రి క్షమాపణలు చెబితే సరిపోదని, తక్షణమే ఆ తప్పును సరిదిద్ది ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ 22ఏ జాబితా పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కేసీఆర్ కు పట్టిన గతే రేవంత్‌కూ పడుతుంది:

మొదటిపేజీ తరువాయి

గతంలో కేసీఆర్ ప్రభుత్వం 'ధరణి'తో ప్రజలను పీడించి ఏ విధంగా అధికారానికి దూరమైందో... ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో పయనిస్తూ తన గోతిని తానే తవ్వుకుంటున్నారని మండిపడ్డారు. హైడ్రా, క్యూర్, 22ఏ వంటి నిర్ణయాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, 30 శాతం కమీషన్ల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తులో బీఆర్ఎస్ కంటే దారుణమైన పరాభవం తప్పదని స్పష్టం చేశారు. వెంటనే 22ఏ కింద చేర్చిన బాధితుల భూములపై రివ్యూ జరిపి, ఆ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని తేల్చిచెప్పారు.

## కొండా సురేఖ స్థానంలో ఎవరు?..

### కేబినెట్ విస్తరణపై పీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించడం పూర్తిగా ఏఐసీసీ నిర్ణయమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. ఆమెపై చర్యలు తీసుకోకుండా ఆపేందుకు ప్రయత్నించినా.. ఏఐసీసీ ఈ విషయంలో సీయస్‌గా ఉండటంతో నిర్ణయం జరిగిపోయిందన్నారు. ఇప్పట్లో విస్తరణ లేనట్లే!ప్రస్తుతం కేబినెట్ విస్తరణకు సంబంధించి హైకమాండ్ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని పీసీసీ చీఫ్ తెలిపారు. రాష్ట్రంలో మంత్రివర్గాన్ని ఎప్పుడు విస్తరించాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయిస్తారని స్పష్టం చేశారు.తనకు మంత్రి పదవి దక్కుతుందంటూ జరుగుతున్న ప్రచారంపైనా మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఈ వార్తలపై తనకు ఎలాంటి సమాచారం లేదని తేల్చిచెప్పారు. దీంతో కొండా సురేఖ స్థానంలో ఎవరికి అవకాశం దక్కుతుందన్న చర్చకు ఇప్పటికైతే స్పష్టత రాలేదు.

## ఉపాధ్యాయుల కంటతడి ఏ దేశానికి, ఏ రాష్ట్రానికి మంచిది కాదు: బండి సంజయ్

మొదటిపేజీ తరువాయి

స్వయంగా ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల కనీస సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోకపోవడం శోచనీయమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా గురువులకు ఉచిత హామీల పాఠాలు చెప్పడం మానేసి, వారి సమస్యలను పరిష్కరించడం అనే ప్రాథమిక పాఠాన్ని నేర్చుకోవాలని ఎద్దేవా చేశారు. టీచర్స్ డే రోజైనా ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ ఇవ్వడమే ఆ ఉపాధ్యాయ లోకానికి ఇచ్చే నిజమైన గౌరవమని బండి సంజయ్ స్పష్టం చేశారు.స్వయంగా ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల కనీస సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోకపోవడం శోచనీయమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా గురువులకు ఉచిత హామీల పాఠాలు చెప్పడం మానేసి, వారి సమస్యలను పరిష్కరించడం అనే ప్రాథమిక పాఠాన్ని నేర్చుకోవాలని ఎద్దేవా చేశారు. టీచర్స్ డే రోజైనా ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ ఇవ్వడమే ఆ ఉపాధ్యాయ లోకానికి ఇచ్చే నిజమైన గౌరవమని బండి సంజయ్ స్పష్టం చేశారు.

# యూపీలో మసీదు కూల్చివేత..

## తెల్లవారుజామున చర్యపై అసదుద్దీన్ ఒవైసీ, అఖిలేశ్ ఫైర్

మొదటిపేజీ తరువాయి

శనివారం ఉదయం భారీ భద్రత బలగాల నడుమ అధికారులు ఈ కూల్చివేత ప్రక్రియను పూర్తి చేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని ఐదు ప్రధాన ద్వారాలను మూసివేసి, న్యాయవాదులతో సహా ఎవరినీ లోపలికి అనుమతించలేదు. ముందుజాగ్రత్త చర్యగా ఐదు కంపెనీల పీఏసీ, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలను మోహరించారు. ప్రభుత్వ భూమిలో ఉన్న అక్రమ నిర్మాణాన్ని తొలగించామని అధికారులు స్పష్టం చేశారు. ప్రజలు సంయమనం పాటించాలని, ఎటువంటి వదంతులను నమ్మవద్దని సహారన్‌పూర్ రేంజ్ డీఐజీ అభిషేక్ సింగ్ విజ్ఞప్తి చేశారు. ఈ మసీదు అక్రమ నిర్మాణమని పేర్కొంటూ 2025లో బజరంగ్ దళ్ నేత వికాస్ త్యాగి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన సహారన్‌పూర్ సిటీ మేజిస్ట్రేట్, జూలై 16న ఆ నిర్మాణాన్ని అక్రమంగా నిర్ధారిస్తూ కూల్చివేతకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ మసీదు కమిటీ జిల్లా కోర్టును ఆశ్రయించగా, సెప్టెంబర్ 2న న్యాయస్థానం వారి అప్పీల్‌ను తిరస్కరించింది.ఈ ఘటనపై స్పందించిన అసదుద్దీన్ ఒవైసీ, హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఇవ్వకుండా అడ్డుకోవడానికే ప్రభుత్వం తెల్లవారుజామున కూల్చివేత చర్యలు చేపట్టిందని విమర్శించారు. "బీజేపీ ప్రభుత్వానికి మసీదు అనే పదంపైనే ద్వేషం ఉంది" అని ఆయన మండిపడ్డారు. మసీదు కమిటీకి అవసరమైన న్యాయ సహాయం అందిస్తామని ఒవైసీ హామీ ఇచ్చారు.సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సైతం ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. "బాధితులకు హైకోర్టు లేదా సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఎందుకు కల్పించలేదు? ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు కుమ్మక్కై న్యాయం అందకుండా చేశారు. ఇతర మతాలను గౌరవించని వారు సనాతనులు కాలేరు" అని ఆయన వ్యాఖ్యానించారు.

## బ్లూ బెల్స్ హైస్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**కరీంనగర్ సెప్టెంబర్ 05( ప్రజా వీక్షణం )**

హనుమాన్‌నగర్‌లోని బ్లూ బెల్స్ హైస్కూల్‌లో శనివారం కృష్ణాష్టమి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో ఆకట్టుకోగా, శ్రీకృష్ణుని జీవిత విశేషాలు, గీతా సందేశం, ధర్మం, నీతి విలువలపై సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని స్మరించుకుంటూ ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. పాఠశాల ప్రిన్సిపాల్ జంగా సునీత మనోహర్ రెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణుని బోధనలు స్ఫూర్తిదాయకమని, విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలు అలవరచుకోవడంతో పాటు గురువుల పట్ల గౌరవం, కృతజ్ఞత కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.







# విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

## -హెచ్‌ఎం నరసింహారావు

## -ఆరెంద జడ్పీహెచ్‌ఎస్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం , సెప్టెంబర్ 05 :**

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆరెంద జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు ఈదులపల్లి నరసింహారావు సూచించారు.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మంథని మండలం ఆరెంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయుడు అందించే విద్య, విలువలు, క్రమశిక్షణ విద్యార్థుల జీవితంపై ఎంతో ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల్లో విద్యతో పాటు మంచి నడవడిక, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో చదివి పాఠశాలకు మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని కోరారు. విద్యార్థులు కూడా తమ లక్ష్యాలను చిన్న వయసులోనే నిర్దేశించుకుని, వాటిని సాధించే దిశగా నిరంతరం శ్రమించాలని సూచించారు. ప్రతిభ ఒక్క రోజులో రాదని, ప్రతిరోజూ క్రమశిక్షణతో చదవడం, ఉపాధ్యాయుల సూచనలు పాటించడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు జ్ఞానంతో పాటు వినయాన్ని అలవర్చుకోవాలని ఆకాంక్షించారు.

**ఉపాధ్యాయుల బోధనను సద్వినియోగం చేసుకోవాలి: సీఆర్పీ మల్లయ్య**

విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలని సిఆర్పి మల్లయ్య సూచించారు. తరగతి గదిలో చెప్పే విషయాలను ఇంటి వద్ద పునశ్చరణ చేసుకుంటూ సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని అన్నారు. విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఎంతో ముఖ్యమని, వారి సూచనలను పాటిస్తూ కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని చెప్పారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా గత విద్యా సంవత్సరంలో పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేసిన శ్రీలత విద్యార్థుల విద్యాభ్యాసంపై చూపిన ప్రత్యేక శ్రద్ధను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఆమెకు లభించే 27 రోజుల సెలవుల్లో 16 రోజులు కూడా పాఠశాలకు హాజరై విద్యార్థులకు బోధన అందించినందుకు గుర్తింపుగా ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు ఆమెను ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు తమ ఉపాధ్యాయుల పట్ల గౌరవాన్ని చాటుకుంటూ వారిని ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులకు ప్రేమతో తీసుకొచ్చిన చిరు కానుకలను అందజేసి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాభివృద్ధి, భవిష్యత్తు లక్ష్యాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓడ్నాల సహేందర్,సువార్త, మమత, పద్మజ, ఎం.డి. గియాసుద్దీన్, శ్రీవాణి, శ్రీలత, అమన్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత నాయకులు,బొట్ల స్వామికి ఘన నివాళులు

**ప్రజా వీక్షణం ,గోదావరిఖని:**

అకాల మరణం పొందిన,ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రామగుండం నియోజకవర్గ ఇన్చార్జి బొట్ల స్వామికి, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఘన నివాళులర్పించింది, 30 సంవత్సరాల క్రితం ఎలకలపల్లి గేటు అంబేద్కర్ సంఘం అధ్యక్షునిగా ప్రస్థానం మొదలై ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రామగుండం నియోజకవర్గ ఇన్చార్జిగా ఎదిగిన బోట్ల,స్వామి గుండెపోటుతో చికిత్స పొందుతూ శుక్రవారం అకాల మరణం చెందారు శనివారం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మైస రాజేష్, కవ్వంపల్లి సతీష్, సీనియర్ నాయకులు పానుగంటి రాజలింగం పుల్లూరి మహేందర్, కాదాసి, కనకయ్య లు, భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు, శవ పేటికపై నీలి జెండా కప్పి ఆయన దళితుల కోసం చేసిన సేవలను కొనియాడారు, బొట్ల స్వామి కుటుంబ సభ్యులకు ప్రగడ సానుభూతి సంతాపాన్ని తెలిపారు ఆయన కుటుంబానికి ఎల్లవేళలా ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం అండగా ఉంటుందన్నారు, ఈ కార్యక్రమంలో పలువురు ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, పాల్గొన్నారు.



# కంబాలపల్లి ఎంజీఎం పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**05/09/2026 (మహబూబాబాద్ ప్రజా వీక్షణం రూలర్)**

కంబాలపల్లి: స్థానిక ఎంజీఎం పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు క్రమశిక్షణ, నైతిక విలువల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం విద్యార్థులు తమ గురువులను శాలువాలతో సత్కరించి, పలు ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి.. ఉద్యోగుల హక్కుల సాధనకు ఐక్య పోరాటం

### జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళీచరణ్ గౌడ్

**కరీంనగర్ సెప్టెంబర్ 05( ప్రజా వీక్షణం )**

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించే "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళీచరణ్ గౌడ్ పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో చలో హైదరాబాద్ పోస్టర్‌ను విడుదల చేసిన సందర్భంగా వారు మాట్లాడుతూ, సెప్టెంబర్ 8న టీఎన్జీవోల కమ్యూనిటీ భవన్‌లో నిర్వహించే ఉమ్మడి జిల్లా స్థాయి సన్నాహక సమావేశానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు భారీ సంఖ్యలో హాజరుకావాలని కోరారు.ఎంప్లాయీస్ హెల్త్ స్కీం (ఈహెచ్‌ఎస్)లోని లోపాలను సరిదిద్దడంతో పాటు పెండింగ్ బకాయిలు, పీఆర్సీ తదితర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన వారికి సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. "పెన్షన్ బిక్ష కాదు.. ఉద్యోగి హక్కు" అని స్పష్టం చేస్తూ, ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలు వినాయక చవితి పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి

### -బలవంతపు చందా వసూళ్లు చేయవద్దు

### -ఏదైనా సమస్యలుంటే మంథని పోలీసులను సంప్రదించండి

### -మంథని సీఐ బుద్దే స్వామి

**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం , సెప్టెంబర్ 05:**

ప్రజలు వినాయక చవితి పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని, ఏదైనా సమస్యలుంటే మంథని పోలీసులను సంప్రదించాలని మంథని సీఐ బుద్దే స్వామి కోరారు. ఈనెల14న వినాయక చవితి పండుగ సందర్భంగా ఎలాంటి అనర్థాలు జరగకుండా మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లకు శనివారం మంథని ఎస్ఐ ఎన్. సందీప్ కుమార్ ఆధ్వర్యంలో మంథని పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ బుద్దే స్వామి మాట్లాడుతూ పండుగ సందర్భంగా నేరాలు, విరోధాలు, బలవంతపు చందా వసూళ్లు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గుంపులు ఏర్పరచడం వంటి పనులు చేయవద్దని కఠినంగా హెచ్చరించారు. స్టేషన్ పరిధి విడిచి వెళ్లే ముందు పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అనుమానాస్పద సమాచారం వెంటనే తెలపాలని సూచించారు. ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.పండుగ బందోబస్తు నిమిత్తం బీట్ చెకింగ్, నైట్ రౌండ్స్, ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు.




# ధాన్యం కుంభకోణం పై సమగ్ర విచారణ జరపాలి

### -ఈడి, విజిలెన్స్, ఐటీ శాఖలకు ఫిర్యాదు చేసిన ఖమ్మంపల్లి మాజీ సర్పంచ్ సముద్రాల రమేష్

**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం , సెప్టెంబర్ 05:**

మంథనిలో వెలుగు చూసిన రూ 12.28 కోట్ల ప్రభుత్వ ధాన్యం కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని ఖమ్మంపల్లి మాజీ సర్పంచ్ సముద్రాల రమేష్ ఈడి, విజిలెన్స్, ఐటీ శాఖలకు ఫిర్యాదు చేసినట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంథని మున్సిపల్ పరిధిలోని రైస్ మిల్లులలో జరిగినటువంటి అవకతవకల పైన చర్య తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. సుమారు రూ. 20 కోట్లు ఈ వ్యవహారం పైన అధికారులు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బాధ్యులైన వారి ఆస్తులను జప్తి చేయాలని బ్యాంకు అకౌంట్ లను సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



# విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించిన ఓపెన్ జిమ్ సభ్యులు

**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం , సెప్టెంబర్ 05:**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం మంథని ఓపెన్ జిమ్ సభ్యులందరూ కలిసి విశ్రాంత ఉపాధ్యాయులైన కొమురోజు శ్రీనివాస్ ,గట్టు నందు, ఓల్లాల శంకర్ లింగం లను ఘనంగా శాలువాలతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా వాళు చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఉపాధ్యాయుల లందరికి ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మంథని మండల ఉపాధ్యాయులను సన్మానించిన జిల్లా కలెక్టర్

**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం , సెప్టెంబర్ 05:**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం పెద్దపల్లి జిల్లా పాలనాధికారి కార్యాలయంలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలంలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులు సిహెచ్ పోచయ్య (మంథని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల), బహుత్ కిషోర్ ( మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తెనుగు గూడెం, మంథని ) ధనశ్రీ( మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వెంకటాపూర్) లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన సందర్భంగా పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా విద్యాధికారి శారద లు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సన్మాన పత్రాలను అందజేశారు. వీరిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.




# మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం , సెప్టెంబర్ 05:**

మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసి, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్. లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ అజ్ఞానం అనే చీకటిని తొలగించి వ్యక్తిలో జ్ఞానం అనే వెలుగును ప్రసాదించే వాడే ఉపాధ్యాయుడని, ఉపాధ్యాయుల సేవలు వెలకట్ట లేనివని విద్యార్థులు తమ ఉపాధ్యాయుల పట్ల ఎల్లప్పుడు గౌరవభావాలతో మెలిగి చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలియజేశారు. డాక్టర్. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తి నుండి ఎదిగి భారత రాష్ట్రపతిగా దేశానికి సేవ చేశారని ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం గా జరుపుకుంటున్నామని ఆయనను స్ఫూర్తిగా తీసుకొని మంచి పౌరులుగా, విద్యావేత్తలుగా మారి దేశాభివృద్ధికి కీలకపాత్ర పోషించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చరిత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్, అధ్యాపకులు అమర్నాథ్, ముకుందం, ఫర్జానా, రజిత, శేఖర్, శ్రీధర్, రామకృష్ణ బోధ నేతర సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.




# జాతీయ లోక్ అదాలత్ లో రాజీ అవకాశం ఉన్న కేసుల విషయంలో చొరవ చూపాలి

### -మంథని సీనియర్ సివిల్ జడ్జి అపర్ణ మల్లాది

**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం , సెప్టెంబర్ 05:**

ఈనెల 12 న జరిగే జాతీయ లోక్ అదాలత్ లో రాజీ అవకాశం ఉన్న కేసుల విషయంలో చొరవ చూపాలని సీనియర్ సివిల్ జడ్జి అపర్ణ మల్లాది పోలీస్ అధికారులను కోరారు, శనివారం మంథని పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో పోలీసు అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశం లో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సుధా రాణి, మంథని సీఐ బుద్దే స్వామి, ఎస్సైలు పాల్గొన్నారు.



# కన్నాల గ్రామంలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలుండాలి

### -ముగ్గులు పోసి పనులు ప్రారంభించిన సర్పంచ్, ఎంపీడీవో

**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం , సెప్టెంబర్ 05:**

జలసిరి కార్యక్రమంలో బాగంగా శనివారం మంథని మండలం కన్నాల గ్రామంలో ఇంకుడు గుంతలకు సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ ఆధ్వర్యంలో ముగ్గులు పోసి పనులు ప్రారంభించారు . ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్, మంథని ఎంపీడీవో శ్రీజ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఉండాలని దీనితో వర్షం పడ్డ ప్రతి నీరు ఒడిసి పట్టాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి గాదె దివ్య,వార్డ్ సభ్యులు పర్షవేన అనిల్, గ్రామ కార్యదర్శి కేశెట్టి మధుకర్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బాపట్ల మండలం గోపాపురంలో రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

బాపట్ల : సెప్టెంబర్ 5 ( ప్రజా వీక్షణం )

బాపట్ల మండలం గోపాపురం గ్రామంలో సమగ్ర భూ రీ-సర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో, రైతులకు అత్యాధునిక భద్రతా ప్రమాణాలు మరియు అధికారిక రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు స్వయంగా రైతులకు కొత్త పాస్ పుస్తకాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ..... భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, రైతుల భూములకు పూర్తి రక్షణ కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ రీ-సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. అత్యాధునిక సెక్యూరిటీ ఫీచర్లతో కూడిన ఈ నూతన పాస్ పుస్తకాల వల్ల రైతులకు ఎంతో భద్రత చేకూరుతుందని, భవిష్యత్తులో భూముల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,బాపట్ల ఆర్డీఓ హరికుమార్,రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# భారతీయ తత్వశాస్త్ర విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్

బాపట్ల : సెప్టెంబర్ 5 ( ప్రజా వీక్షణం )

బాపట్ల వియ్యంకుడు సర్వేపల్లి భారతీయ తత్వశాస్త్ర విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. రాష్ట్రపతి పీఠాన్ని అధిష్టించి, భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపజేశారు ఆయన. ఆయన రచించిన గ్రంథాలు అజరామరమైనవి.భారతరత్న పురస్కారాన్ని అందుకొని, ఉపాధ్యాయులకు ఎనలేని ఖ్యాతినిఆర్జించి పెట్టారు. ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి,అత్యున్నత స్థానానికి చేరుకోవడంలో ఆయన చేసిన కృషి అనన్య సామాన్యమైనది.యునెస్కో అధ్యక్షుడిగా పని చేసి,దేశ ఖ్యాతిని దశదిశలా చాటారు. బాపట్ల కు చెందిన కామరాజు హనుమంతరావుకు తన కుమార్తెను ఇచ్చి వివాహం జరిపించి,బాపట్ల వియ్యంకుడిగా,మనకు కీర్తి ప్రతిష్టలను తెచ్చిపెట్టారు.డాక్టర్ సర్వేపల్లి జయంతి సందర్భంగా శనివారం పోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో మండల కార్యాలయం వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పి సి సాయిబాబు,సబ్ ట్రెజరీ అధికారి ఏ పరిశుద్ధ రావు, న్యాయవాదులు జమృద్ బాషా,తిరువీధుల శంకర ప్రసాద్, చంద్రారెడ్డి,నర్రా సాంబు తదితరులు పాల్గొన్నారు.



# కన్యాకాపరమేశ్వరి పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

బాపట్ల : సెప్టెంబర్ 5 ( ప్రజా వీక్షణం )

శనివారం బాపట్ల పట్టణంలో కన్యాకాపరమేశ్వరి ఎలిమెంటరీ పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సంఘ సేవకురాలు బండ్రెడ్డి రజని పాల్గొని,సర్వేపల్లి రాధా కృష్ణ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి నమస్కారం చేసుకుని ఉపాధ్యాయులు అందరికి శుభాకాంక్షలు తెలియచేసి ,విద్యార్థులకు బాగా చదువుకుని పాఠశాలకి,తల్లి తండ్రులకు మంచి పేరు తేవాలని తెలియ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.



# మహిళా సాధికారతపై పీహెచ్‌డీ సాధించిన డా. జగన్నాథం విజయబాబు

తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 5 (ప్రజా వీక్షణం)

తాడేపల్లిగూడెం పట్టణంలోని డి.ఆర్. గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్థిక శాస్త్ర అధ్యాపకుడు డా.. జగన్నాథం విజ యబాబు పీహెచ్‌డీ పట్టాను సాధించా రు. స్వయం సహాయక బృందా ల ద్వారా మహిళా సాధికారత, నూతనం గా ఏర్పడిన పశ్చిమగోదావరి జిల్లాలో ఒక అధ్యయనం అనే అంశంపై పరిశోధన చేసిన ఆయన కర్నూలులోని రాయలసీమ విశ్వ విద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఈ మేరకు రాయలసీమ విశ్వ విద్యాలయం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. నూతనంగా ఏర్పడిన పశ్చిమ గోదావరి జిల్లాలో స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత స్థాయిలలో వచ్చిన మార్పులను విజయబాబు తన పరిశోధనలో అధ్యయనం చేశారు. మహిళల స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు, జీవనోపాధి, ఆదాయాభివృద్ధి, కుటుంబ నిర్ణయాల్లో మహిళల పాత్ర, నిర్ణయాధికారం తదితర అంశాలను విశ్లేషించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. శ్రీమన్నారాయణ, జగన్నాథం విజయబాబును అభినందించారు. సామాజిక ప్రాధాన్యం కలిగిన మహిళా సాధికారత అంశంపై పరిశోధన చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ పరిశోధన విద్యార్థులతో పాటు సమాజానికి కూడా ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు జగన్నాథం విజయబాబును ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలు చేపట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# విజ్ఞాన వృక్షంలాంటి గురువుల సేవలు చిరస్మరణీయం

అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు, జనసేన నాయకులు విన్నకోట సురేష్

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తుకు బాటలు వేయాలి

బంగారు భారతావని నిర్మాణంలో భావితరాలను తీర్చిదిద్దే గురువులదే అత్యంత కీలక పాత్ర

విద్యార్థుల్లో నైతిక విలువలను, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయం

బాపట్ల : సెప్టెంబర్ 05 ( ప్రజా వీక్షణం )



సమాజ నిర్మాణంలో, భావితరాల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర వెలకట్టలేనిదని అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు,బాపట్ల జనసేన నాయకులు విన్నకోట సురేష్ పేర్కొన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించు కుని ఆయన శనివారం ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు. భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ లోకానికి ఆయన హృదయ పూర్వక శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా విన్నకోట సురేష్ మాట్లాడుతూ.. “విజ్ఞాన వృక్షంలా ంటి గురువు గొప్పదనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. మనకు అక్షర జ్ఞానాన్ని అందించి, వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేసి, ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలిచే ఉపాధ్యాయులను మనం నిత్యం గౌరవించాలి” అని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని ప్రపంచ వేదికపై అత్యున్నత స్థాయికి చేర్చిన మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఉపాధ్యాయుడు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కేవలం పాఠ్యపుస్తక విద్యను అందించడమే కాకుండా, విద్యార్థుల్లో నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందిస్తూ దేశ భవిష్యత్తును నిర్ణయించే బాధ్యతగల పౌరులను తీర్చిదిద్దే బృహత్తర గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అంకితభావంతో రేపటి పౌరులను తీర్చిదిద్దుతున్న ప్రతి ఒక్క ఉపాధ్యాయుడికి అఖండ ఫౌండేషన్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో బోధనా రంగంలో విశేష సేవలందిస్తున్న ఉపాధ్యాయులందరికీ ఈ పండుగ స్ఫూర్తితో మరింత ఉత్సాహంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# ఘనంగా శ్రీకృష్ణుని డోలారహణ కార్యక్రమం...

దేవరకద్ర సెప్టెంబర్ 5 ప్రజా వి క్షణం

దేవకదరా మున్సిపాలిటీ కేంద్రంలోని స్థానిక చెన్నకేశవ స్వామి దేవాలయం వద్ద శుక్రవారం అర్ధరాత్రి శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా అంగనంగా వైభవంగా డోలారహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి భజన కార్యక్రమం నిర్వహించారు. తదుపరి శుక్రవారం రాత్రి 12 గంటలకు శ్రీకృష్ణుని డో లరహణ కార్యక్రమం వైభవం జరిగింది. భజన పరులు అలాగే మహిళలు స్వామి వారికి ఉయ్యాల పాటలు ఎంతో భక్తితో పాడారు. ఈ కార్యక్రమంలో అర్చకులు సంజీవ చారి, ప్రాణేష్ చారి, భజన బృందం సభ్యులు మహిళలు పాల్గొన్నారు.



# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బాలికా సాధికారతపై అవగాహన సదస్సు

తాడేపల్లిగూడెం ప్రతినిధి సెప్టెంబర్ 5 (ప్రజా వీక్షణం)

తాడేపల్లిగూడెం పట్టణంలోని సుబ్బారావు పేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ఉపాధ్యాయుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు దాసరి ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పలివెల ఏకాంబరేశ్వర రావు, జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ నున్న సుందర్రావు, వాసవి క్లబ్ డైరెక్టర్ పెనుగొండ శ్రీనివాసరావు, వైస్ గవర్నర్ సన్నిధి సూర్యనారాయణమూర్తి ముఖ్యవక్తులుగా పాల్గొన్నారు. బేటి బచావో బేటి పడావో, సుకన్య సమృద్ధి పథకాలు వంటి వాటిపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయ దినోత్సవం దాని ప్రాముఖ్యతను తెలియజేస్తూ పాఠశాలలోని మహిళా అధ్యాపక బృందానికి వాసవి క్లబ్ అధ్యక్షులు ఆలపాటి కృష్ణకుమార్, కోశాధికారి సాయి ప్రశాంత్, జోన్ చైర్మన్ పసుమర్తి అనిల్, ముఖ్య అతిథుల చేతుల మీదగా సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల జీవితాలకు దిశానిర్దేశం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, ఉపాధ్యాయులు దేశానికి, రాష్ట్రానికి, సమాజానికి ఉత్తమ పౌరులను అందించడంలో చేస్తున్న సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు.



# ఉప్పుటూరు అంగన్వాడీ పాఠశాలలో పోషకాహారంపై అవగాహనా కార్యక్రమం

పర్చూరు : సెప్టెంబర్ 5 ( ప్రజా వీక్షణం )

శనివారం ఉదయం ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ జాతీయ పోషకాహార వారోత్సవాల సందర్భంగా స్థానిక అంగన్వాడి సెంటర్ నందు పోషకాహారం పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలంటే పోషక విలువలతో కూడిన సమతుల్యమైన ఆహారాన్ని తీసుకోవడం బాల్యం నుండే అలవాటు చేసుకోవాలని, మనం తినే ఆహారంలో మాంసకృత్తులు, పిండి పదార్థాలు, కొవ్వులు, విటమిన్స్ మరియు ఖనిజలవనాలు అన్ని సమపాళ్లలో ఉండాలని, అప్పుడే మానవ దేహానికి అవసరమైన అన్ని రకాల పోషకాలు లభించి, మనిషి ఆరోగ్యవంతునిగా ఉంటాడని, కానీ మారుతున్న జీవనశైలి నేపథ్యంలో పిన్న వయస్సు నుండి పెద్దల వరకు, అందరూ ఎక్కువగా ఫాస్ట్ఫుడ్స్ మరియు జంక్ ఫుడ్స్(చిరుతిండ్లు)కు అలవాటు పడిపోయారని, దాంతో మన దేహానికి అవసరమైన దానికన్నా ఎక్కువ కేలరీలు తీసుకోవడం మరియు శారీరక శ్రమ లేకపోవడం వల్ల అధిక బరువు, ఊబకాయం మరియు హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలతో బాల్యం నుండే బాధపడుతున్నారని, కావున ప్రతి ఒక్కరూ బాల్యం నుండే హితాహారాన్ని తీసుకోవాలని, చిన్నపిల్లలు ప్యాకెట్ చిరుతిండ్లను వీలైనంతవరకు బాగా తగ్గించి, అంగన్వాడి సెంటర్లో రోజూ అందించే పౌష్టికాహారమైన కోడిగుడ్డు, పాలు వంటి ఆహార పదార్థాలను పారేయకుండా తినాలని, అలాగే తల్లిదండ్రులు కూడా వీలైనంతవరకు లేదా కనీసం తమ పిల్లల నైనా ఫోన్ మరియు చిరుతిండ్లకు దూరంగా ఉంచి, వారిలో పౌష్టికాహారాన్ని మరియు వ్యాయామ ధోరణి ప్రోత్సహించాలన్నారు. అనంతరం పిల్లలకు తొలి గురువు మరియు వారి ఉజ్వల భవిష్యత్తులకు పునాదులు వేసే అంగన్వాడీ టీచర్స్ అందరికీ టీచర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారు అందిస్తున్న నిస్వార్థమైన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ బాలశ్యామల, ఆయా, అంగన్వాడీ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



# బాపట్లలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

బాపట్ల : సెప్టెంబర్ 5 ( ప్రజా వీక్షణం )

బాపట్ల పట్టణం పటేల్ నగర్ ఫస్ట్ లైన్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి జె.డి. శీలం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిసిసి కార్యదర్శి గంటా అంజిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు .రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బాపట్ల మున్సిపాలిటీ పరిధిలోని 34 వార్డులతో పాటు నియోజకవర్గంలోని అన్ని పంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను పోటీకి దించాలని నిర్ణయించారు.కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు గాను పట్టణ, పంచాయతీ వార్డు కమిటీలను వారం రోజుల్లోగా నియమిస్తామని జె.డి. శీలం ప్రకటించారు.గత కొన్నేళ్లుగా ప్రజలు ఇతర పార్టీల పనితీరును చూశారని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీతో కలిసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలందరూ కష్టపడి పనిచేసి కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించాలని మాజీ కేంద్రమంత్రి జె డి శీలం కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దేవరాజు, జిల్లా పార్టీ నాయకులు ఎస్.వి.ఆర్. కుమార్, బాబురావు, రోశయ్య, దోనేపూడి రవి లతో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం.. వంజిరిలో 106 జతల షూస్ పంపిణీ...

సిర్పూర్ కాగజనగర్ ప్రతినిధి :సెప్టెంబర్ 05( ప్రజావీ క్షణం న్యూస్)

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజనగర్ మండలం వంజిరి గ్రామపంచాయతీ లోని విద్యార్థుల సంక్షేమానికి గ్రామపంచాయతీ పెద్దపీట వేస్తోంది. వంజిరి గ్రామపంచాయతీ పరిధిలోని ఏం పి యూ పి ఎస్ వంజిరి పాఠశాలలో 106 మంది విద్యార్థులకు 106 జతల షూస్‌ను పంపిణీ చేశారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు వారి విద్యాభివృద్ధికి తోడ్పడేలా చర్యలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ లక్ష్మీ (గోపాల్), ఉపసర్పంచ్ భరత్, గ్రామ కార్యదర్శి శ్వేతారాణి, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే లక్ష్యంగా గ్రామపంచాయతీ ముందుకు సాగుతోందని సర్పంచ్ పేర్కొన్నారు.



## ఏపీ నిట్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

### గురువుల మార్గదర్శకత్వంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

### ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి

**తాడేపల్లిగూడెం ప్రతినిధి సెప్టెంబర్ 5 (ప్రజా వీక్షణం)**

ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనదని, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర అత్యంత కీలకమని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి తెలిపారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లోని డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులదేనని తెలిపారు. గురువుల బోధన, మార్గదర్శకత్వం, విలువలతో కూడిన విద్య విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని సూచించారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి, వారి లక్ష్యసాధనకు అవసరమైన ప్రోత్సాహం అందించడం ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని చెప్పారు. సమాజ అభివృద్ధికి నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, మంచి విలువలు కలిగిన పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నా రని తెలిపారు. గురువుల వద్ద గురుభక్తితో విద్యను అభ్యసించి, దేశాభివృద్ధికి విద్యార్థులు తమ వంతు కృషి చేయాలని చెప్పారు. విద్యార్థులు ఏ రంగంలో రాణించినా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఎప్పటికీ మరువకూడదని సూచించారు. భారత దేశానికి తొలి ఉపరాష్ట్రపతిగా, రెండవ రాష్ట్రపతిగా విశేష సేవలందించిన భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజును దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. గురువుల సేవలను స్మరించుకోవడంతో పాటు వారి విలువలను విద్యార్థు లు ఆచరించాలని సూచించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటా నికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి అసోసియేట్ డీన్, ఆచార్యులు డాక్టర్ రాజేశ్వర్ రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శీనివాసన్, డాక్టర్ గుర్రాల కిరణ్ కుమార్, డాక్టర్ నిషా అమర్నాథ్ జొన్నియా, డాక్టర్ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న పేరూరు గ్రామ సర్పంచ్..

**దేవరకద్ర సెప్టెంబర్ 5 ప్రజావి క్షణం**

నియోజకవర్గంలో ని కౌకుంట్ల మండల పరిధిలో పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేరూరు గ్రామ సర్పంచ్ కొత్త శృతి అరవింద్ రెడ్డి పాల్గొని ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ నిర్మాణంలో గురువుల సేవలు చిరస్మరణీయమని అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జరుపుకునే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ గురువులను గౌరవించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించి, వారి సేవలను అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బండారి గొల్ల రాములు, వార్డు మెంబర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బాలికా సాధికారతపై అవగాహన సదస్సు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి సెప్టెంబర్ 5 (ప్రజా వీక్షణం)**

తాడేపల్లిగూడెం పట్టణంలోని సుబ్బారావు పేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ఉపాధ్యాయుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు దాసరి ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పలివెల ఏకాంబరేశ్వర రావు, జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ నున్న సుందర్రావు, వాసవి క్లబ్ డైరెక్టర్ పెనుగొండ శ్రీనివాసరావు, వైస్ గవర్నర్ సన్నిధి సూర్యనారాయణమూర్తి ముఖ్యవక్తులుగా పాల్గొన్నారు. బేటి బచావో బేటి పడావో, సుకన్య సమృద్ధి పథకాలు వంటి వాటిపై విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయ దినోత్సవం దాని ప్రాముఖ్యతను తెలియజేస్తూ పాఠశాలలోని మహిళా అధ్యాపక బృందానికి వాసవి క్లబ్ అధ్యక్షులు ఆలపాటి కృష్ణకుమార్, కోశాధికారి సాయి ప్రశాంత్, జోన్ చైర్మన్ పసుమర్తి అనిల్, ముఖ్య అతిధుల చేతుల మీదగా సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల జీవితాలకు దిశానిర్దేశం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, ఉపాధ్యాయులు దేశానికి, రాష్ట్రానికి, సమాజానికి ఉత్తమ పౌరులను అందించడంలో చేస్తున్న సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు.



## బాపట్ల మున్సిపల్ హై స్కూల్ లో గురుపూజోత్సవ వేడుకలు...

### ఎన్.ఎం.ఎం.ఎస్ ఉచిత శిక్షణా తరగతుల ప్రారంభం...

**బాపట్ల : సెప్టెంబర్ 5 ( ప్రజా వీక్షణం )**

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా (గురుపూజోత్సవ వేడుకలను) జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సర్వేపల్లి వారి చిత్రపటమునకు పూలదండలను వేసి గురుపూజోత్సవ ప్రాముఖ్యతను తెలియజేసినారు. గురుపూజోత్సవ మహోన్నతమైన రోజున 8వ తరగతి విద్యార్థులకు ఎన్.ఎం.ఎం.ఎస్ ఉచిత శిక్షణ తరగతులను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రారంభించినారు. ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్) ఉచిత శిక్షణా తరగతులు మున్సిపల్ హై స్కూల్ నందు జరుగుతాయనిబాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి డి. శ్రీనివాస్ సింగ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందించే ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ ఒక సువర్ణ అవకాశమని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి ఏటా రూ. 12,000 చొప్పున నాలుగు సంవత్సరాల కాలానికి రూ. 48,000 నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని పేర్కొన్నారు. విద్యార్థుల ఆర్థిక భరోసాకు,భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడే ఈ ఉచిత శిక్షణా తరగతులను తల్లిదండ్రులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్వ శిక్ష అభియాన్ ఎడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆవుల శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యాశాఖ తో పాటు స్వచ్ఛంద సంస్థ అయిన మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ముందుకు రావడం అభినందనీయమని వారి సేవలను ఉపయోగించుకొని ఎక్కువ మంది విద్యార్థులు స్కాలర్షిప్ ఉందే విధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులను విద్యార్థులను కోరారు. మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డాక్టర్ బి.శరత్ బోస్ మాట్లాడుతూ,ప్రభుత్వ,జిల్లా పరిషత్ మరియు ప్రభుత్వ ఆధీనంలోని పాఠశాలల్లో ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ శిక్షణకు అర్హులని వెల్లడించారు. మానవతా సంస్థ అధ్యక్షులు గురజాల శ్రీనివాసరావు,వైస్ చైర్మన్ తోట. రామాంజనేయులు,డైరెక్టర్ కోలా సుబ్బారావు,సంస్థ వైస్ చైర్మన్ జి.శాంతారామ్,డైరెక్టర్ వంకాయలపాటి హరిబాబు, సంస్థ ప్రధాన కార్యదర్శి వి. జ్యోత్స్న,మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయని బి.రాజశ్రీ,కరణం రవీంద్రబాబు,సంస్థ సాంస్కృతిక విభాగం కన్వీనర్ కోట వెంకటేశ్వర్ రెడ్డి,సంఘ సేవకురాలు బి.రజిని,సిహెచ్. కేశవులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులకు మానవతా సంస్థ తయారు చేయించిన జ్యూట్ బ్యాగులను,మొక్కలను అందజేశారు.




## ప్రజలకు నాణ్యమైన ఆర్థిక సేవలు అందించాలి

### మార్గదర్శి నూతన శాఖ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 5 ( ప్రజా వీక్షణం)**

ప్రజలకు నమ్మకమైన, పారదర్శకమైన ఆర్థిక సేవలు అందిస్తూ వారి ఆర్థిక భద్రతకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ మరింతగా కృషి చేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని శ్రీ స్క్వేర్ మాల్‌లో, విజేత సూపర్ మార్కెట్ పైన ఏర్పాటు చేసిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ నూతన శాఖను శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం శాఖను పరిశీలించి నిర్వాహకులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల అవసరాలను గుర్తించి వారికి మెరుగైన ఆర్థిక సేవలు అందించాల్సిన బాధ్యత ఆర్థిక సంస్థలపై ఉందన్నారు. ప్రజల్లో పొదుపు అలవాటును పెంపొందించడంలో చిట్‌ఫండ్ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పారదర్శకత, నిబద్ధతతో సేవలు అందించాలని సంస్థ ప్రతినిధులకు సూచించారు. తాడేపల్లిగూడెంలో నూతన శాఖ ఏర్పాటు చేయడం సంతోషకరమని, దీని ద్వారా స్థానిక ప్రజలకు సంస్థ సేవలు మరింత చేరువ కానున్నాయని అన్నారు. నూతన శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించి మంచి ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. సంస్థ నిర్వాహకులు, సిబ్బంది అంకితభావంతో పనిచేసి వినియోగదారుల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని సూచించారు. నూతన శాఖ మరింత అభివృద్ధి చెంది ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలని కోరుతూ నిర్వాహకులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, మార్గదర్శి సంస్థ ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రహదారి సమస్యకు పరిష్కార మార్గం చూపిన డీఎఫ్ఓ బాలామణి...

### చీలపల్లి, మేడిపల్లి, మాలిని గ్రామాల సర్పంచుల వినతిపై సానుకూల స్పందన...

**సిర్పూర్ కాగజ్ నగర్ ప్రతినిధి: సెప్టెంబర్ 05 (ప్రజావీ క్షణం న్యూస్ )**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్: రహదారి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామాల ప్రజలకు ఊరటనిచ్చేలా ఆసిఫాబాద్ డీఎఫ్ఓ బాలామణి, సానుకూలంగా స్పందించారు. శనివారం సిర్పూర్ రేంజ్ పరిధిలోని మాలిని అటవీ ప్రాంతంలో పర్యటించిన ఆమె, అటవీ ప్రాంత పరిస్థితులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చీలపల్లి, మేడిపల్లి, మాలిని గ్రామపంచాయతీల సర్పంచులు తమ గ్రామాలకు సంబంధించిన రహదారి సమస్యను డీఎఫ్ఓ దృష్టికి తీసుకెళ్లారు. రహదారి సౌకర్యం లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించగా, సమస్యపై సానుకూలంగా స్పందించిన డీఎఫ్ఓ బాలామణి, సాధ్యమైన పరిష్కార మార్గాలపై అధికారులతో చర్చించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల రాకపోకలకు కీలకమైన రహదారి సమస్య పరిష్కారానికి అధికారులు స్పందించడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పర్యటనలో ఎఫ్డీవో భార్గవ్ కుమార్, ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్, సెక్షన్ ఆఫీసర్ మోహన్ రావుతో పాటు అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## ధర్మానికి దిక్సూచి శ్రీకృష్ణ పరమాత్ముడు..

### వైభవంగా ఉట్లు కొట్టే కార్యక్రమం

**దేవరకద్ర సెప్టెంబర్ 5 ప్రజా విక్షణం**

శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా దేశమంతటా పల్లెల్లో, గ్రామాలలో, నగరాలలో పట్టణాలలో జరుపుకునే వేడుకలు లో భాగంగా బాలకృష్ణుడు గా ఉన్నప్పుడు గోపికలు ఉట్టిపై దాచిన వెన్నను దొంగిలించడానికి చేసిన ప్రయత్నాలను కులాల వర్గాలకతీతంగా ముఖ్యంగా యాదవులు శనివారం సాయంత్రం లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణం వద్ద ఉట్లు కొట్టే కార్యక్రమం పండుగ వాతావరణం గా, ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహిస్తారు. గ్రామాల్లో జరిగిన కృష్ణాష్టమి ఉత్సవాలలో యాదవ యువకులను ప్రోత్సహిస్తూ, ఉట్టి తాడును గుంజడం, లాగడం లాంటి సంబరాలు జరిపారు. యాదవులు మాట్లాడుతూ మూగజీవాలను కంటికి రెప్పలా కాపాడుతూ, గోవులను సంరక్షిస్తూ అమాయకంగా జీవించే యాదవుల వంశంలో సాక్షాత్తు శ్రీమహావిష్ణువు దశావతారం లో భాగంగా గోవులను ఇష్టపడే గోవిందునిగా, దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించే శ్రీకృష్ణ పరమాత్మునిగా పరిపూర్ణమైన భగవంతుడిగా అవతరించిన మన యాదవ కులం ఎంతో పవిత్రమైనదని పురాణాలు చరిత్రలు చెబుతున్నాయి. ఇప్పటివరకు తిరుపతి వెంకటేశ్వర స్వామి నికూడా ప్రతిరోజు మొట్టమొదటి దర్శనం మన యాదవులకు మాత్రమే ఉండడం మన అదృష్టంగా భావిస్తున్నాను. మహాభారత యుద్ధంలో శ్రీకృష్ణుడు బోధించిన గీతోపదేశం యుగాలు మారినా తరాలు మారినా ప్రపంచవ్యాప్తంగా ధర్మానికి దిక్సూచిగా నిలబడిందని, అలాంటి మహాగ్రంధమును ప్రతి ఒక్కరి ఇంటిలో ఉంచుకోవాలని, ఈ కార్యక్రమం జరుపుకుంటున్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో కాటమరాజు ప్రతాపరుద్రుడు, శ్రీకృష్ణదేవరాయలు లాంటి యాదవులంతా రాజ్యాలను పాలించారని, వారి కాలంలో ప్రజలు సుఖశాంతులతో జీవించారని చరిత్రలు చెబుతున్నాయి. అందుకే మన యాదవులంతా ఐక్యంగా ఉంటే గతంలో కోల్పోయిన వైభవాన్ని ఉత్తర భారత దేశంలో లాగా మనం కూడా ఇక్కడ సాధించ వచ్చని పిలుపునిచ్చారు. గ్రామానికి చెందిన కురువ యాదవులు రాము ఉట్టిని కొట్టడం జరిగింది. అలాగే మున్సిపల్ చైర్ పర్సన్ దమయంతి గోవర్ధన్ రెడ్డికి, అర్చకులు ప్రాణేశాచారి, సంజీవ చారి కి, శాలువాతో సన్మానం చేశారు. అలాగే అక్కడ శిశుమందిర్ పాఠశాల చెందిన విద్యార్థులు సంస్కృతి క కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో జగన్మోహన్ రెడ్డి ప్రతాపులు, నాగిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్, కిరణ్, భజన బృందం సభ్యులు మహిళలు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులకు సన్మానం..

**దేవరకద్ర సెప్టెంబర్ 5 ప్రజా వీక్షణం**

మండల పరిధిలోని గూర కొండ గ్రామంలో శనివారం పాఠశాలలో ఉపాయధ్యాయ దినోత్సవ కార్యక్రమం లో పాల్గొని విద్యార్థులకు షూస్ మరియు బెల్ట్ అందజేసి అలాగే ఉపాధ్యాయులను సన్మానించిన గ్రామ సర్పంచ్ చెన్నమ్మ ఉసనప్ప,కి ఉప సర్పంచ్ కి వార్డ్ మెంబర్స్ కు విలేజ్ సెక్రటరీ కి సహకరించిన అందరు ఉపాధ్యాయులకు ధన్యవాదములు తెలిపారు.



ప్రజావీక్షణం
దినపత్రిక

## ఉత్తమ ఉపాధ్యాయుని సన్మానించిన కలెక్టర్.. ఎమ్మెల్యే..

దేవరకద్ర సెప్టెంబర్ 5 ప్రజా వీక్షణం



మండల పరిధిలోని నార్లోని కుంట్ల గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం గా పనిచేసిన జిల్లా టి యు టి ఎఫ్ అధ్యక్షులు శంకరును శనివారము సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎన్నికైనందుకు జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్త, ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి, శాలువాతో సన్మానం చేసి మెమొంటో ప్రశంస పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ప్రొటెక్షన్ యాక్ట్ కోసం అసెంబ్లీలో ప్రస్తావిస్తా

### దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

### భూత్పూర్ లో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన టీయూడబ్ల్యూజే (ఐజేయు) మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు..

దేవరకద్ర (సెప్టెంబర్ 5): ప్రజా వీక్షణం

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్న జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం తీవ్రంగా ఖండించదగ్గ విషయమని, వారికి ప్రత్యేక రక్షణ చట్టం (జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్) తెచ్చే విధంగా రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో గళం విప్పుతానని దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి హామీ ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలో భూత్పూర్ మండల కేంద్రంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా నాయకులు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ఉన్న విలేకరులపై తరచూ జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. గతంలో తెచ్చిన 'అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్' తరహాలోనే జర్నలిస్టుల భద్రతకు కూడా చట్టం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విషయాన్ని అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు కాటం నాగరాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ రెడ్డి, కోశాధికారి జిల్లాల రఘు, వార్త వేదిక ఎడిటర్ చంద్రశేఖర్ గౌడ్, చిక్కా వెంకట్, గోకులం వెంకటేష్, దేవరకద్ర నియోజకవర్గ అధ్యక్షుడు యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.



# టీఎంజేఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ







## మహాసభలను జయప్రదం చేయండి

## బూర్గుల నాగేందర్ పిలుపు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 05 (ప్రజా వీక్షణం న్యూస్)

తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం మూడో రాష్ట్ర మహాసభలను ఈ నెల 12న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు టీఎం జేఫ్ ఫౌండర్, రాష్ట్ర అధ్య క్షుడు బూర్గుల నాగేందర్ తెలిపారు. మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం హనుమకొండలో టీఎంజేఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లా నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించా రు. మాజీ ఉప ముఖ్య మంత్రి తాటికొండ రాజయ్య, మాజీ వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహాసభల్లో జర్న లిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, మాదిగ జర్నలి స్టుల హక్కులు, వృత్తిపర మైన అంశాలపై విస్తృతం గా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బూర్గుల నాగేందర్ మాట్లా డుతూ.. ప్రజాస్వామ్యం లో ప్రజల గొంతుకగా పని చేస్తూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావ డంలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. జర్నలిస్టు లు ఎదుర్కొంటున్న వృత్తి పరమైన, ఆర్థిక, సామాజిక సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయా ల్సిన అవసరం ఉందన్నా రు. మాదిగ జర్నలిస్టులకు వృత్తిపరంగా సమాన అవ కాశాలు, తగిన గుర్తింపు, సంక్షేమం, భద్రత కల్పించే అంశాలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యా చరణ రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాదిగ జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవం తం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో టీఎంజేఫ్ రాష్ట్ర కార్యదర్శి అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షు లు బొల్లెపాక రాజేష్, పసు ల తిరుపతి, రాష్ట్ర అధికా ర ప్రతినిధి పెండ్యాల సుమన్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సందేల రాజు, జిల్లా కార్యదర్శులు భాస్కర్, శ్రీకాంత్, సీనియ ర్ నాయకుడు పెండెల శ్రీని వాస్ తదితరులు పాల్గొ న్నారు. అలాగే వివిధ మీడి యా సంస్థలకు చెందిన జర్నలిస్టులు ఆర్‌కేఎల్ టీవీ రిపోర్టర్ గణిపాక అనిల్, రన్ న్యూస్ రిపోర్టర్ వడ్డే పల్లి రాజు, మెట్రో రిపోర్టర్ బరిగెల కార్తీక్, ఐబీ న్యూస్ రిపోర్టర్ దామెర ప్రవీణ్, లాయల్ ప్రేమ్ రిపోర్టర్ జన్ను అనిల్, తెలంగాణ చరిత్ర రిపోర్టర్ హనుమ కొండ విజయ్, అన్వేషణ రిపోర్టర్ దామెర వేణు తదితరులు పాల్గొన్నారు.

## మూసాపేటలో మైనింగ్ అధికారుల విచారణ..

దేవరకద్ర సెప్టెంబర్ 5 ప్రజా వీక్షణం

నియోజకవర్గం పరిధిలోని మూసాపేట మండల పరిధిలోని మౌలాలిగుట్టలో ఎలాంటి అనుమతు లు లేకుండా గత నెల 3 న షేక్ పాషా తండ్రి అబ్దుల్ హుస్సేన్ తన సొంత జెసిబితో దాదాపు 50 ట్రిప్పుల మొరాన్ని అక్రమంగా తరలించారని మూసాపేటకు చెంది న అబ్దుల్ ఖాదర్ జిల్లా మైనిం గ్ శాఖ అధికారులకు గత నెల 6 న ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే అబ్దుల్ ఖాదర్ చేసిన ఫిర్యాదుపై శనివారం జిల్లా మైనింగ్ శాఖ అధికారులు, మూసాపేట మండల తహసిల్దార్ కార్యాలయ అధికారులు సంయుక్తంగా విచారణ చేపట్టారు. ఈ విచారణలో జిల్లా మైనింగ్ శాఖ రాయల్టీ ఇన్స్పెక్టర్ రాజారెడ్డి, సర్వేయర్ సుజాత, మూసాపేట మండలం తహసిల్దార్ కార్యాలయం చెందిన రెవిన్యూ ఇన్స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.



## 1000 రోజుల ప్రజాపాలనపై కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు..డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క... ఎమ్మెల్సీ దండే విట్టల్...





కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 05 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. డీసీసీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన కూడళ్ల మీదుగా కొనసాగింది. అనంతరం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు టపాసులు పేల్చి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఎమ్మెల్సీ దండే విట్టల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు .ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనమే కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల ప్రజాపాలన అని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రులు ,ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు ప్రజా క్షేత్రంలో నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్నారని తెలిపారు .ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, పంట రుణమాఫీ, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, యువతకు ఉపాధి, విద్యా అవకాశాలు కల్పించడం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు.అసలైన నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తున్నామని, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఎలాంటి వివక్ష లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన అనేక రంగాలను కాంగ్రెస్ ప్రభుత్వం గాడిలో పెడుతోందని అన్నారు .ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని, కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల పేరుతో జరిగిన అవినీతికి భిన్నంగా రైతులకు నిజమైన ప్రయోజనం చేకూర్చే సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు .ఎమ్మెల్సీ దండే విట్టల్ మాట్లాడుతూ .. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారెం టీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నామని తెలిపారు.రైతులు, మహిళలు, యువత, పేదలు, గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో వెనుకబడిన రంగాలను కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి గాడిలో పెడుతోందని,రాబోయే రోజు ల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి రాష్ట్రంలోని ప్రతి ఇంటికి ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ,డైరెక్టర్ రాంచందర్,ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు రాపర్తి మురళి, టౌన్ అధ్యక్షులు ఇమ్రాన్ హస్మి, డీసీసీ ఉపాధ్యక్షులు తరిఖ్,భీమ్ రావ్, జిల్లా కార్యదర్శి శోభన్, రాజీవగాంధీ పంచాయితీ రాజ్ సంఘటన్ జిల్లా కో ఆర్డినేటర్ కోవా ఇందిరా,ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా భాయ్,ఆసిఫాబాద్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కమల్ నాథ్ రెడ్డి,మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచ్ లు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీ లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు ,అనుబంధ సంఘాల నాయకులు కాంగ్రెస్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలనకు 'సంఘమిత్ర' వారధి







**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 05 (ప్రజా వీక్షణం న్యూస్)**

పోలీస్--ప్రజల భాగస్వా మ్యంతో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం గా 'సంఘమిత్ర' కార్యక్ర మాన్ని శనివారం హన్మ కొండలోని కాళోజీ కళా క్షేత్రంలో ఘనంగా ప్రారం భించారు. మహిళా స్వయం సహాయక సంఘాలు గ్రామ దీపికలు మెప్మా సభ్యుల భాగస్వా మ్యంతో డ్రగ్స్, గంజాయి వినియోగం వల్ల కలిగే అన ర్థాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించను న్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ.. ప్రతి ఎస్ హెచ్ జి సభ్యురాలు 'సంఘమిత్ర'గా పనిచేసి డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని ప్రతి కుటుంబానికి చేర వేయాలని పిలుపునిచ్చా రు. డ్రగ్స్ విక్రయం, విని యోగం, సరఫరాపై సమా చారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియ జేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు తగిన రివార్డు అందిస్తామని తెలిపారు. డ్రగ్స్‌కు బానిసైన వారిని దూరం చేయకుండా కౌన్సె లింగ్, వైద్య సహాయం, కుటుంబ సహకారం అందించాలని సూచిం చారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ.. డ్రగ్స్ సమస్య పోలీసులకే పరి మితం కాదని, సమాజం మొత్తం కలిసికట్టుగా ఎదుర్కోవాలని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా మెలిగి వారి సమస్యలను తెలుసు కోవాలని సూచించారు. ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఎస్ హెచ్ జి సభ్యుడు డ్రగ్స్ నిర్మూలనలో సైని కుడిలా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో డ్రగ్స్ అవేర్‌నెస్ స్కిట్, ప్రత్యేక వీడియోల ద్వారా అవగాహన కల్పించారు. వెయ్యికి పైగా మహిళా సంఘాల సభ్యులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. "ప్రతి తల్లి చైతన్యవంతమైతే -- ప్రతి కుటుంబం సురక్షితం.. ప్రతి కుటుంబం చైతన్యవంతమై తే -- డ్రగ్స్ రహిత సమాజం సాధ్యం" అనే సందేశంతో సంఘమిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# ములకలపల్లిలో తీవ్ర ఉద్రిక్తత.. పోడు భూముల్లో ట్రెంచ్ తవ్వకం అడ్డుకున్న మాస్ లైన్ నాయకులు, గ్రామస్తులు

**ములకలపల్లి, సెప్టెంబర్ 5:(ప్రజా వీక్షణం)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకల పల్లి మండలంలో పోడు భూముల వివాదం తారాస్థాయికి చేరింది. మండ ల పరిధిలోని మూకమామిడి రెవెన్యూ పరిధికి చెందిన రంగాపురం గ్రామం లో దశాబ్దాలుగా అన్నదాతలు నమ్ముకు ని సాగు చేసుకుంటున్న పోడు భూము లపై కార్పొరేషన్ అధికారులు ఏకపక్షం గా ట్రెంచ్ (కందకం) తవ్వడానికి పూనుకున్నారు. అధికారుల ఈ దుం దుడుకు చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తూ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నాయకు లు మరియు స్థానిక గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగి, ట్రెంచ్ తవ్వకాలను ఉమ్మడిగా అడ్డుకున్నారు .గ్రామానికి చెందిన నిరుపేద రైతులు ఏళ్ల తరబడి ఎలాంటి వివాదాలకు తావులేకుండా జీవనం సాగిస్తున్నారు. రంగాపురం గ్రామస్తులు ఏకంగా 2005 సంవత్సరం నుండి పోడు భూములను బాగుచేసుకుంటూ వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతు న్నారు. ఈ నేపథ్యంలోనే గత బిఆర్ఎ స్ ప్రభుత్వం 2023వ సంవత్సరంలో వాస్తవ సాగుదారులందరినీ గుర్తించి, వారి శ్రమను గౌరవిస్తూ చట్టబద్ధమైన హక్కు పత్రాలు (పట్టాలు) సైతం మంజూరు చేయడం జరిగింది. గత 20 సంవత్సరాల సుదీర్ఘ కాలంగా కార్పొరేషన్ అధికారులకు, గ్రామస్తుల కు మధ్య ఎలాంటి ఘర్షణలు గానీ, వివాదాలు గానీ తలెత్తలేదు. అయితే, ప్రస్తుతం కొత్తగా వచ్చిన కార్పొరేషన్ శాఖ అధికారులు కావాలనే ప్రజలు కష్టపడి సాగు చేసుకుంటున్న భూము ల్లో ట్రెంచ్ తవ్వాలని ప్రయత్నించడ ంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. ప్రభుత్వాలు చట్టబద్ధంగా ప ట్టాలు మంజూరు చేసినప్పటికీ, కార్పొరేషన్ అధికారులు తమ హద్దుల ను మీరి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని నాయకులు మండి పడ్డారు. కావాలనే రైతుల పోడు భూముల సరిహద్దులు దాటి మధ్యలోకి వచ్చి కందకాలు తవ్వాలనే ఆలోచన



ఏమాత్రం సరికాదని, ఇది పేద రైతుల పొట్ట కొట్టడమేనని అధికారులను గ్రా మస్తులు నిలదీశారు. పేద ప్రజలు అర్ధ అకరం, ఎకరం చొప్పున భూమిని నమ్ముకుని బతుకుతుంటే, కార్పొరేషన్ అధికారులు దౌర్జన్యంగా ట్రెంచ్ తవ్వడానికి ప్రయత్నించడంపై తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. అధికారులు తమ ఈ అక్రమ ప్రయత్నాలను తక్షణ మే మానుకోవాలని హెచ్చరి ంచారు. లేనిపక్షంలో పేద రైతులు, పోడు సాగుదారుల పక్షాన నిలబడి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రజా సంఘాల ను, రాజకీయ పార్టీలను ఏకతాటిపైకి తెచ్చి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతా మని నాయకులు తీవ్రంగా హెచ్చరిం చారు.

# ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజల తరపున బిఆర్ఎస్ పోరాటం ఆగదు....!





ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని గుర్తు చేస్తూ, నెరవేర్చని పథకాల లెక్కలతో రూపొందించిన "కాంగ్రెస్ బాకీ కార్డులను" ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రజలకు అందజేశారు.

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 05 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 అబద్ధపు హామీలు మరియు నెరవేర్చని వాగ్దానాలను ఎండగడుతూ బి ఆర్ ఎస్ పార్టీ పోరుబాట పిలుపులో భాగంగా లింగాపూర్ మండల కేంద్రంలో డిజిటల్, క్షేత్రస్థాయి ప్రచారం హోరెత్తింది.?ప్రజాక్షేత్రంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కాంగ్రెస్ మోసపూరిత వైఖరిపై నిరసన వ్యక్తంచేశారు.?ఈ కార్యక్రమంలో ముఖ్య విశేషాలు:

**రోడ్డుపైనే వంట-వార్పు:**

నిత్యావసరాల ధరల పెరుగుదల, కాంగ్రెస్ పథకాల అమలులో వైఫల్యాన్ని నిరసిస్తూ రోడ్డుపైనే వంట-వార్పు చేపట్టి, కాంగ్రెస్ మార్క్ "పాలన వైఫల్యాన్ని" నిరసించారు.

ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ:

**ప్రజల నుంచి విశేష స్పందన:**

రైతులు, మహిళలు, యువత బి ఆర్ ఎస్ పోరుబాటకు అడుగడుగునా మద్దతు తెలిపారు. రూ. 2,000 పెన్షన్, రైతుబంధు, మహాలక్ష్మి పథకాల అమలులో జరుగుతున్న ఆలస్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లింగాపూర్ సర్పంచ్ జాధవ్ రాజశేఖర్, పిక్లతండా సర్పంచ్ బానోత్ కిషన్, మాజీ జడ్పీటీసీ ఆడే లక్క నాయక్, మాజీ ఎంపీపీ జాధవ్ గౌరీ బాయి గణపత్, బి ఆర్ ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ జాటోత్ రాహుల్, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పవార్ గబ్బు సెట్,బోడ బాపూరావు,నుణావత్ కిషన్,జాధవ్ లక్ష్మణ్, జాధవ్ విజయ్, జాధవ్ దేవిదాస్,రాథోడ్ బావురావు, జాధవ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు నష్టపరిహారం అందజేస్తాం.. జిల్లా ప్రత్యేక అదనపు కలెక్టర్ హరిప్రియ..

**దేవరకద్ర సెప్టెంబర్ 5 ప్రజా వీక్షణం**

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని రైల్వే డబ్లింగ్ పనుల కోసమై దాని సమయంలో ఉన్న కొన్ని ఇండ్లు పోతున్నాయని అలాంటి వారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందుతుందని జిల్లా ప్రత్యేక అదనపు కలెక్టర్ హరి ప్రియ, అన్నారు. శనివారం మున్సిపాలిటీ కేంద్రంలోని రైల్వే డబ్లింగ్ పనులను ఆర్డిఓ నవీన్ తో కలిసి ఇండ్లను పరిశీలించారు. ఇండ్లుమాత్రమే ఇందులో పోతున్నాయని అలాంటి వారికి నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు తెలిపారు. దీనికి సంబంధించి ఇటీవల ఇంటి యజమానులకు నోటీసులు కూడా అందజేయడం జరిగిందని వాటిని అధికారులు పరిశీలించారు. ఇందులో మొత్తం 5, 11 ఎకరాలు పోతున్నాయని వారు తెలిపారు. ఇందుకోసం అధికారులకు ఇంటి యజమానులు పూర్తిగా సహకరించాలని వారి కోరారు. పరిశీలించిన వారిలో రైల్వే అధికారులు ఆర్ అండ్ బి అధికారులు రెవెన్యూ అధికారులు ఉన్నారు. వారి వెంట రైల్వే అధికారి రవి, తాసిల్దార్ హర్షద్ అహ్మద్, ఆర్ ఐ శరత్ నాయక్, జిపిఓ రాజు, గ్రామస్తులుతదితరులు పాల్గొన్నారు.



# గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీకి ప్రజల నుంచి మంచి స్పందన

## పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలి: అయినంపూడి శ్రీదేవి

**తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 5 (ప్రజా వీక్షణం)**

గ్రామీణ ప్రాంతాల్లో భారతీయ జనతా పార్టీకి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో బీజేపీ మండల సమావేశాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నూనె రాధా నివాసం వద్ద జరిగిన ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, నరసాపురం పార్లమెంట్ మీడియా కన్వీనర్, తాడేపల్లిగూడెం రూరల్ మండల ఇన్‌చార్జి నరిసే సోమేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అయినంపూడి శ్రీదేవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ పట్ల ప్రజల్లో ఆదరణ, నమ్మకం పెరుగుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి చేరేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉండాలని చెప్పారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయడంతో పాటు యువత, మహిళలను పెద్దఎత్తున పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని ఆమె సూచించారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని కోరారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో గ్రామస్థాయిలో పార్టీ పరిస్థితి, ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు. గ్రామానికి చెందిన పలువురు మహిళలు పార్టీలో చేరారు. ఈ సమావేశంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు..

**దేవరకద్ర సెప్టెంబర్ 5 ప్రజావి క్షణం**

దేవరకద్ర మండల కేంద్రంలోని స్థానిక కురువ వాడలో ఉన్న ఆంజనేయ స్వామికి శ్రావణమాసంలో నాలుగో శనివారం సందర్భంగా సాయంత్రము మున్సిపల్ చైర్ పర్సన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, అర్చకులు ప్రాణేష్ చారి, పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమం లో ప్రతాపులు, జగన్మోహన్ రెడ్డి, రామాంజనేయులు, మైబు, రాములు, కురుమూర్తి, నాగిరెడ్డి, వీరాచారి, వెంకటయ్య, లక్ష్మీనారాయణ, కిరణ్, కురువ సంఘం యాదవులు తదితరులు పాల్గొన్నారు.



GENERAL NEWS
06 ఆదివారం సెప్టెంబర్ 2026
8
www.prajaveekshanam.in
ప్రజావీక్షణం
దినపత్రిక

## ఉపాధ్యాయుల సేవలు సమాజానికి మార్గదర్శకం

### టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి)

తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 5 (ప్రజా వీక్షణం)

ఉపాధ్యాయుల సేవలు సమాజ నిర్మాణానికి ఎంతో కీలకమని, విద్యార్థులకు విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణను నేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేసే గురువుల సేవలు చిరస్మరణీయమని తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెదేపా ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. వలవల బాబ్జి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులను పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) మాట్లాడుతూ సమాజానికి ఉత్తమ పౌరులను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత గొప్పదని అన్నారు. విద్యార్థుల జీవితాల్లో గురువుల బోధన, మార్గదర్శకత్వం చెరగని ముద్ర వేస్తాయని చెప్పారు. ఉపాధ్యాయులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని, వారి సేవలకు సమాజం ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆకాశపు స్వామి, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పాతూరి రాంప్రసాద్ చౌదరి, గంధం సతీష్, పద్మనాభుని మురళి, సనగన శ్రీనివాస్, దాట్ల జగన్నాథరాజు, దొడ్ల బాలాజీ, కొల్లి రమావతి, కాకర్ల సుభద్ర, ఎస్.కె. హాజీ, నాగ శ్రీను, పోతురాజు సత్యనారాయణ, పుట్ట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## ఫాదర్ కొలంబో పాఠశాలలో ఘనంగా టీచర్స్ డే వేడుకలు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 05 (ప్రజా వీక్షణం న్యూస్)




స్టేషన్ ఘన్‌పూర్‌లోని ఫాదర్ కొలంబో పాఠశాల లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్‌మాస్టర్, కర స్పాండెంట్ ఫాదర్ థామస్ కిరణ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ న్ జయంతిని పురస్కరిం చుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించు కుంటామని తెలిపారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యా యుల పాత్ర ఎంతో కీలక మని పేర్కొన్నారు.తదనంతరం విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నా యి. విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు టీచర్స్ డే శుభాకాంక్షలు తెలియ జేస్తూ, వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయు లు, విద్యార్థులు తదితరు లు పాల్గొన్నారు.

## రెండు గ్యాంగ్‌ల మధ్య గొడవలో యువకుడు బలి

### మత్తులో కత్తితో దాడి.. 24 ఏళ్ల యువకుడి మృతి

### నిందితులకు కఠిన శిక్ష పడాలని కుటుంబ సభ్యుల వేడుకోలు

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 05 (ప్రజా వీక్షణం న్యూస్)



రెండు గ్యాంగ్‌ల మధ్య ఏర్పడిన విభేదాలు చివరకు ఓ యువకుడి ప్రాణాలను బలిగొన్న ఘట న మామునూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మా పూర్‌లో కలకలం రేపింది. మేకల గౌతం (24)పైఇద్దరు వ్యక్తులు కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెంది నట్లు పోలీసులు తెలి పారు. పోలీసుల వివరాల ప్రకారం.. పవన్, జానకి రామ్ అనే వ్యక్తులు కలిసి ముఠాగా ఏర్పడి నిర్మాను ష్య ప్రాంతాల్లో తిరిగే విద్యా ర్థులు, యువతను బెదిరిం చి వీడియోలు చిత్రీకరించి డబ్బులు వసూలు చేస్తు న్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో గ్యాంగ్‌లోని గిరిధర్‌కు పవన్, జానకిరామ్‌తో మనస్పర్థలు ఏర్పడినట్లు పోలీసులు తెలిపారు. గిరిధర్‌కు మద్దతుగా ఉన్న అతని బాబాయి మేకల గౌతంను రాత్రి సమయం లో ఇంటి నుంచి బయటకు పిలిపించి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లినట్లు సమాచారం. అక్కడ ఘర్షణ చోటుచేసుకోగా పవన్, జానకిరామ్ కలిసి గౌతంపై కత్తితో దాడి చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. పొట్ట, ఛాతీపై తీవ్ర గాయాలు కావడంతో గౌతం మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనతో గౌతం కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. నిందితులు మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై ఈ దారుణానికి పాల్పడ్డా రని కుటుంబ సభ్యులు ఆరోపించారు. తమకు న్యాయం జరిగేలా నింది తులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చూడాలని పోలీసులను వేడుకున్నా రు.ఘటనపై మామునూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రెండు గ్యాంగ్‌ల మధ్య విభే దాలు, ఘటనకు దారితీసి న పరిస్థితులు, నిందితుల పై ఉన్న ఆరోపణలపై పోలీ సులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నారు.

# నాలా పరివాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాల జోరు!







### దీనదయాళ్‌నగర్ బస్తీల్లో ఐదు, ఆరు అంతస్తుల భవనాలు..

### -- పట్టణ ప్రణాళిక అధికారుల మౌనం ఎందుకు?

### -- ఇరుకు రోడ్లు.. పక్కనే రసాయన నాలా.. సెట్‌బ్యాక్‌లకు తిలోదకాలు

### -- భారీవర్షాలు వస్తే ప్రమాదం పొంచి ఉందంటున్న స్థానికులు......

బాలానగర్ : సెప్టెంబర్ 5 (ప్రజా వీక్షణం)

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోయిన్‌పల్లి సర్కిల్, ఫతేనగర్ డివిజన్ పరిధిలో గల దీనదయాళ్‌నగర్ బస్తీల్లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. నాలా పరివాహక ప్రాంతానికి ఆనుకుని ఉన్న బస్తీల్లో నిబంధనలకు విరుద్ధంగా ఐదు, ఆరు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్తీ ప్రాంతాల్లో సాధారణంగా ఇరుకైన రహదారులు, పరిమిత స్థలాలు ఉండగా.. వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా భవనాలపై భవనాలు పెంచుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక అంతస్తుకు అనుమతి ఉంటే మరో అంతస్తు.. ఆ తర్వాత మరో అంతస్తు.. ఇలా నిర్మాణాలు అంతస్తుల మీద అంతస్తులుగా పెరుగుతున్నా సంబంధిత అధికారులు కళ్లకు కనిపించనట్లుగా వ్యవహరిస్తున్నారని బస్తీవాసులు మండిపడుతున్నారు.

**-- ఇరుకు రోడ్ల మధ్య భారీ భవనాలు.........**

దీనదయాళ్‌నగర్ బస్తీల్లో అనేక ప్రాంతాల్లో రహదారులు ఇప్పటికే ఇరుకుగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ఎదురెదురుగా రెండు వాహనాలు వెళ్లాలన్నా ఇబ్బందులు ఎదురవుతున్న పరిస్థితుల్లో భవనాల నిర్మాణాలు రహదారుల వైపునకు మరింతగా విస్తరిస్తుండటంతో భవిష్యత్‌లో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు సైతం లోపలికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడితే బాధ్యత ఎవరిది? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**-- ఓ వైపు రోడ్డు.. మరో వైపు నాలా.. అయినా సెట్‌బ్యాక్ లేకుండానే నిర్మాణాలా?**

కొన్ని ప్రాంతాల్లో భవనాలకు ఒకవైపు రహదారి, మరోవైపు రసాయన వ్యర్థాలతో కూడిన నాలా ఉండటంతో నిర్మాణాలకు తగినంత ఖాళీ స్థలం, సెట్‌బ్యాక్ ఉండటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాలా అంచులకు సమీపంలోనే నిర్మాణాలు చేపడుతున్నారని, నిబంధనలను పక్కనపెట్టి నిర్మాణాలు కొనసాగుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.నాలా పరివాహక ప్రాంతంలో భారీ నిర్మాణాలు జరిగితే వర్షాకాలంలో వరదనీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడే అవకాశం ఉండటంతో పాటు భవనాల భద్రతపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

**-- నోటీసులకే పరిమితమవుతున్న చర్యలంటూ ఆరోపణలు**

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినప్పటికీ అధికారులు కేవలం నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నోటీసులు ఇచ్చిన తర్వాత నిర్మాణాలు నిలిచిపోతున్నాయా? లేక అదే వేగంతో కొనసాగుతున్నాయా? అన్నది అధికారులు స్పష్టం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.కొంతమంది నిర్మాణదారులు నిబంధనలను పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**పేదల బస్తీల్లో 'అక్రమ నిర్మాణాల'కు అడ్డూ అదుపూ లేదా?**

దీనదయాళ్‌నగర్ బస్తీల్లో అనేక కుటుంబాలు రోజువారీ కూలీ పనులు, చిన్నచిన్న ఉపాధి పనులపై ఆధారపడి జీవిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అలాంటి ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా భారీ భవనాలు వెలుస్తుండటం వల్ల భవిష్యత్‌లో పేద కుటుంబాల భద్రత, మౌలిక వసతులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సామాన్యుడు చిన్న ఇంటి నిర్మాణానికి అనుమతుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుండగా.. కొందరు మాత్రం నిబంధనలను పక్కనపెట్టి అంతస్తుల మీద అంతస్తులు ఎలా నిర్మించగలుగుతున్నారు అని బస్తీవాసులు ప్రశ్నిస్తున్నారు.

**-- అధికారుల 'చూసీచూడనట్లు' వైఖరిపై అనుమానాలు.........**

అక్రమ నిర్మాణాలపై స్థానికుల నుంచి ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సంబంధిత పట్టణ ప్రణాళిక అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా తనిఖీలు నిర్వహించి, భవనాలకు అనుమతులు ఉన్నాయా? అనుమతించిన అంతస్తుల కంటే అదనపు అంతస్తులు నిర్మించారా? నాలా పరిధిలో నిబంధనలు ఉల్లంఘించారా? సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించారా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ఇక అక్రమ నిర్మాణాల విషయంలో కొందరు అధికారులు, నిర్మాణదారుల మధ్య కుమ్మక్కు జరుగుతోందనే గుసగుసలు కూడా వినిపిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే ఇవి ఆరోపణలు మాత్రమేనని, వాటిపై సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాల్సి ఉందని వారు అంటున్నారు.

**-- ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి........**

నాలా పరివాహక ప్రాంతంలో భవన నిర్మాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ప్రతి నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, నిర్మాణ విస్తీర్ణం, అంతస్తుల సంఖ్య, సెట్‌బ్యాక్, నాలాకు ఉన్న దూరం తదితర అంశాలను పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, ఇప్పటికే నోటీసులు జారీ చేసిన నిర్మాణాల పరిస్థితిపై బహిరంగంగా వివరాలు వెల్లడించాలని వారు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అక్రమ నిర్మాణాలు పెరిగితే భవిష్యత్‌లో రోడ్డు రద్దీ, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, నాలా ప్రవాహం, అగ్నిప్రమాదాలు వంటి సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతారా? లేక నోటీసులకే పరిమితమవుతారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

## గురు పరిరక్షణ దీక్షలో ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ సంచలన ఆరోపణలు: డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరగాలి!

నందిగామ, సెప్టెంబర్ 5 (ప్రజా వీక్షణం):

తాడేపల్లిలో జరిగిన గురు పరిరక్షణ దీక్ష కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ మన రాష్ట్ర విద్యా వ్యవస్థపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయ నియామకాల భర్తీలో కూటమి ప్రభుత్వం ఘోరమైన మోసాలకు పాల్పడిందని, మంత్రి నారా లోకేష్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.ఉపాధ్యాయ నియామక పరీక్షల పేరుతో నారా లోకేష్ మరియు కూటమి నాయకులు భారీ కుంభకోణానికి పాల్పడ్డారని, ఒక్కో ఉద్యోగానికి పది లక్షల నుండి పదిహేను లక్షల రూపాయల వరకు డబ్బులు తీసుకుని ఎలాంటి అర్హత లేని నకిలీ గురువులను మన బడులలోకి పంపించేశారని ఆయన ఆరోపించారు. డబ్బులిచ్చి ఉద్యోగాలు సంపాదించుకునేలా విద్యా వ్యవస్థను వ్యాపార కేంద్రంగా మార్చేశారని ధ్వజమెత్తారు.అర్హత లేని ఉపాధ్యాయులు బడికి వెళితే అక్కడ చదువుకునే అమాయక విద్యార్థుల భవిష్యత్తు ఏమైపోవాలని, దీనివల్ల రాష్ట్రంలో వేలాది మంది పిల్లల చదువు నాశనమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత పెద్ద అన్యాయం జరు గుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఈ విషయం అసలు తెలియదా అని అరుణ్ కుమార్ సూటి గా ప్రశ్నించారు.ఉపాధ్యాయ నియామకాల్లో అడుగడుగునా అవినీతి అక్రమాలు జరిగాయని, ఇందులో ఎవరెవరు తప్పుచేశారు మరియు తెరవెనుక ఎవరున్నారు అనే నిజాలు బయటకు రావాలంటే ఈ ఉద్యోగాల భర్తీపై వెంటనే కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని మొదటి నుండి డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. కనీసం ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేయని వారికి, ఉపాధ్యాయ అర్హత పరీక్ష పాస్ కాని వారికి క్రీడా కోటా పేరుతో ఉద్యోగాలను అమ్ముకున్నారని మండిపడ్డారు. నిబంధనలకు తూట్లు పొడిచి విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న నారా లోకేష్ తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే "డబ్బుల కోసం అర్హత లేనివారికి ఉద్యోగాలమ్మి భావి భారత పౌరుల జీవితాలతో ఆడుకుంటున్న కూటమి ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం." అంటూ -ఐ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్, శాసనమండలి సభ్యులు అన్నారు.




Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com

ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
06 ఆదివారం సెప్టెంబర్ 2026
9
www.prajaveekshanam.in

## జిల్లాలో సంక్షేమ హాస్టల్ ల సమస్యలను పరిష్కరించాలి

### కె వి పి ఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్...

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 05 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా హైదరాబాద్ లో జరిగిన కె వి పి ఎస్ రాష్ట్ర కమిటీ సమావేశంలో కె వి పి ఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ హాజరై మాట్లాడారు జిల్లాలో సంక్షేమ హాస్టళ్లలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ జిల్లా అదికారులు హాస్టల్ లను తనికి చేయక పోవడం వలన జిల్లాలో కొన్ని హాస్టల్ ల నిర్వహణ గాడి తప్పుతుంది దీనివలన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు ముఖ్యంగా జిల్లాలో సాంఘిక సంక్షేమవసతి గృహాలు శిథిలావస్థకు చేరిపోయిన కూడా అధికారులు పట్టించుకోకపోవడం వలన విద్యార్థులు ఇబ్బందులలో విద్యాభ్యాం చేయవలసి వస్తుంది జిల్లా కేంద్రంలో బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించేల జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఎస్ సీ, ఎస్ టి, బి సి. మైనారిటీ గురుకులలకు స్వంత భవనాలు మంజూరు అయ్యే విధంగా జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరారు




## ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల సవరణ జాబితా లో హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

బాపట్ల : సెప్టెంబర్ 5 ( ప్రజా వీక్షణం )

ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా లో హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు.శనివారం కర్లపాలెం మండలం, చింతయపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలోని 198 పోలింగ్ స్టేషన్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్లో పెండింగ్లో ఉన్న హియరింగ్ దరఖాస్తులపై ఆయన విఆర్ఓ, ఎ ఇ ఆర్ ఓ ను ఆరా తీశారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ గత రెండు మాసముల నుండి జరుగుతున్నప్పటికీ హియరింగ్ ప్రక్రియలో పురోగతిలేకపోవుటలో వీఆర్వో పై చర్యలకు బాపట్ల ఆర్. డి. ఓ ను ఈ ఆఫీస్ ద్వారా ఫైల్ పంపాలని ఆయన సూచించారు. అనంతరం కర్లపాలెం,మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయమును జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి పరిశీలించారు. కార్యాలయంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియను కంప్యూటర్ నందు ఆయన పరిశీలించారు. ఓటర్ల ఫోటోలు నమోదు మొదలగు విషయాలపై ఆయన సంబంధిత సిబ్బందిని ప్రశ్నించారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి హరికుమార్, కర్లపాలెం తాహాసిల్దార్ రవీంద్ర, ఎంపీడీవో శ్రీనివాసరావు, వీఆర్వో షేక్ మహబూబ్ సుభాని, ఇతర అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



## పెనుమాక గాంధీ కుటుంబాన్ని పరామర్శించిన వడ్డీ రఘురామ్ నాయుడు

తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 5 (ప్రజా వీక్షణం):

తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలం పత్తిపాడు గ్రామానికి చెందిన పెనుమాక గాంధీ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురామ్ నాయుడు శనివారం ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులనుపరామర్శించారు.ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ పెద్దను కోల్పోవడం ఎంతో బాధాకరమని పేర్కొంటూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. గాంధీ కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. గాంధీ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ని మర్యాదపూర్వకంగా కలిసిన కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్షచౌదరి..

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 05 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన హర్షచౌదరి జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న పలు కార్యక్రమాలపై చర్చించారు.



## షైన్ ఆర్కే పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు..

దేవరకద్ర సెప్టెంబర్ 5 ప్రజా విక్షణం

కల్బురిగి లోని శనివారము షైన్ ఆర్కే పాఠశాలలో భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త. డాక్టర్. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అర్చన, అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు అర్చన, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఉపాధ్యాయుల సేవలను, విద్యార్థుల జీవితాల్లో గురువుల పాత్రను వివరించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగానికి అందించిన సేవలను, ఆయన ఆదర్శాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులను గౌరవించాలని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు చూపిన ప్రేమాభిమానాలకు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. తదుపరి ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు. గీత జోషి, శైలజ, నందిని,సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## పోలవరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సంతాపం.. కొయ్యలగూడెంలో కొల్లూరు గెరటయ్య చిత్రపటానికి ఘన నివాళి

కొయ్యలగూడెం సెప్టెంబర్ 05( ప్రజా వీక్షణం )

కొయ్యలగూడెం గ్రామానికి చెందిన కొల్లూరు గెరటయ్య కొద్దిరోజుల కిందట అనారోగ్యంతో లేదా అకస్మాత్తుగా మృతి చెందిన విషయం తెలుసుకొని,శనివారం నాడు పోలవరం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మరియు నియోజకవర్గ ఇన్చార్జ్ తెల్లం బాలరాజు స్వయంగా వారి నివాసానికి విచ్చేశారు. అనంతరం కొల్లూరు గెరటియ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ సంతాప సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడుతూ, మృతి చెందిన గెరటియ్య ఆత్మ శాంతించాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆయన మరణం ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు.మరి ఈ కార్యక్రమంలో భాగంగా కొయ్యలగూడెం మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీపీ గంజి మాల రామారావు, కొయ్యలగూడెం మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ తుమ్మలపల్లి గంగరాజు, వైసిపి కొయ్యలగూడెం టౌను మాజీ ప్రెసిడెంట్ సంకు కొండ, గోపాలపురం మండలం వైసీపీ పార్టీ ప్రెసిడెంట్ శ్రీరామ్ మూర్తి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొల్లూరు యశ్వంత్, జినిగి కిషోర్, దుర్గ రాజు, కొయ్యలగూడెం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ టౌన్ వైస్ ప్రెసిడెంట్ పూలపల్లి రవికుమార్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని గెరటయ్య చిత్రపటానికి నివాళులు అర్పించారు.




## ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట: సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీ కీలక సమీక్ష

అమరావతి సెప్టెంబర్ 5 (ప్రజా వీక్షణం):




రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం మరియు సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని మరోసారి స్పష్టమైంది. ఇందులో భాగంగా అమరావతిలో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ ఉన్నతస్థాయి కమిటీ అత్యున్నతస్థాయి సమావేశాన్ని అంగరంగ వైభవంగా మరియు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ కీలక సమావేశంలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం ప్రభుత్వం తరపున క్షేత్రస్థాయిలో అమలువుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై కూలంకషంగా, సుదీర్ఘంగా సమీక్ష జరిపారు.ఈ ఉన్నతస్థాయి సమావేశంలో ప్రభుత్వ మంత్రులు డీఎస్?బీవీ స్వామి, సంధ్యారాణి, ప్రభుత్వ విప్ మరియు నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాల ఫలాలు ఎలాంటి అవినీతికి తావులేకుండా పూర్తిస్థాయిలో నేరుగా అందుతున్నాయా లేదా అనే అంశంపై అధికారులతో సీఎం చంద్రబాబు గారు ప్రత్యేకంగా చర్చించారు.ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల విద్య, ఉపాధి అవకాశాలు, ఆర్థిక సాధికారత, సామాజిక భద్రత మరియు మౌలిక వసతుల కల్పన వంటి అత్యంత ప్రాధాన్యతా రంగాల్లో మరింత వేగంగా పురోగతి సాధించడమే లక్ష్యంగా ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సంక్షేమ పథకాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అమలయ్యేలా ప్రభుత్వ అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ ఫలం చివరి లబ్ధిదారుడి ఇంటి గడప వరకు చేరేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, అలాగే ఈ వర్గాల భవిష్యత్తును మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కొత్త అభివృద్ధి కార్యక్రమాలు, వినూత్న ప్రణాళికలపై కూడా ఈ సమావేశంలో సుదీర్ఘంగా సమాలోచనలు జరిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సామాజిక, ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని, సమాజంలో వారికి అన్ని రంగాలలోనూ సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఈ సమావేశం ద్వారా మరోమారు స్పష్టంచేశారు.

## ఉత్తమ ఉపాధ్యాయులుగా మన గ్రామ ఉపాధ్యాయులు...

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 05 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) నియోజకవర్గంలోని చింతలమానేపల్లి మండలానికి చెందిన కేతిని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల (టి డబ్ల్యూ ఆశ్రమ హై స్కూల్ కేతిని ) ఉపాధ్యాయులు బోధనలో చూపుతున్న ప్రతిభకుగానూ పలు పురస్కారాలు పొందారు.పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచడం, క్రీడలు, సాంస్కృతిక అంశాలు మరియు గిరిజన విద్యార్థుల వికాసానికి విశేష సేవలు అందించిన ఉపాధ్యాయులను జిల్లా రాష్ట్ర స్థాయిలో "ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించిఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా సత్కరించడం జరిగింది. సమర నందేవ్ ఇంగ్లీష్ ఆత్రం జలపాతి పిటి కె .రాజయ్య ఎస్ జె టి.మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



## రామడుగు తాసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం:

### మహిళా మోర్చా అధ్యక్షురాలు మాడిశెట్టి శుష్మిత:

రామడుగు: ప్రజా వీక్షణం

రామడుగు మండలం మాడిశెట్టి పల్లె గ్రామానికి చెందిన బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు మాడిశెట్టి శుష్మిత కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ను మహిళా విభాగం అధ్యక్షురాలు నిర్మల రెడ్డిని మర్యాద పూర్వకంగా శనివారం కలిసి శాలువతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి మహిళ కి 2500/- ఇస్తానని మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం రామడుగు తాసిల్దార్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడతామని అలాగే జీవన భృతి కల్యాణ లక్ష్మి పథకం నిరుకార్చే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కి బుద్ధి వచ్చేలా పెద్ద ఎత్తున మహిళలతో తాసిల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని రామడుగు మహిళా మోర్చా అధ్యక్షురాలు మడిశెట్టి శుష్మిత తెలిపారు.



# ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

## - మాజీ కౌన్సిలర్ రుక్మాంగాధర్ బండారి

## - ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 5(ప్రజా వీక్షణం):

అజ్ఞానపు చీకట్లను తొలగించి జ్ఞాన జ్యోతులను వెలిగించేది ఒక గురువు మాత్రమేనని మాజీ కౌన్సిలర్ రుక్మాంగాధర్ బండారి అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కూలీ లైన్ ప్రైమరీ స్కూల్లో విధులను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను రుక్మాంగాధర్ బండారి శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంను 1962 సంవత్సరం నుండి నిర్వహించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. తరతరాలుగా గురువుని పూజనీయ స్థానంలో ఉంచి తల్లి, తండ్రి తర్వాత స్థానం గురువుకు ఇచ్చిన సంస్కృతి మనదని బండారి తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయుడు తన జీవితాన్ని శిష్యుల భవిష్యత్తు కోసం అంకితం చేసే మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూలీలైన్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు గణేష్, ఉపాధ్యాయులు సాయి చందు, సుభాషిని విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# గురువులను గౌరవించిన నాడే దేశాభివృద్ధి

## - పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్ బాసిత్

## - మోడ్రన్ ఇక్రా స్కూల్ లో ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు

## - సందడి చేసిన విద్యార్థిని విద్యార్థులు

## - పాఠశాలంతా పండగ వాతావరణం

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 5(ప్రజా వీక్షణం):

కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరం సుభాష్ చంద్రబోస్ నగర్ లోని ఉన్న మోడ్రన్ ఇక్రా స్కూల్ లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువుల ఔన్నత్యాన్ని చాటి చెబుతూ తెలుగు హిందీ ఇంగ్లీష్ ఉర్దూ భాషల్లో విద్యార్థుల ప్రసంగాలు నృత్య ప్రదర్శనలతో గురువుల గొప్పదనాన్ని చాటి చెప్పారు. అలాగే తరగతుల వారిగా విద్యార్థులు తమ తమ క్లాస్ టీచర్లకు కానుకలు ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ నేటి భౌతిక వాద సమాజంలో విద్యను వ్యాపార దృక్పథంతో చూస్తూ గురువులను గౌరవించటం లేదని ఇది సరికాదన్నారు. సంవత్సరాల తరబడి అదే తరగతి గదుల్లో ఉంటూ తమ విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చే నిస్వార్థ పరులైన టీచర్లను మనమంతా గౌరవించిన నాడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అధ్యాపకురాలు పర్వీన్ సుల్తానా, టీచర్లు శిరీష, సల్మా, నాజియా, సరస్వతి, లతీఫా, జేబీషా, అనితా, విజయలక్ష్మీ, సుహాన, కమల తదితరులు పాల్గొన్నారు.



# టీచర్స్ డే సందర్భంగా ఉపాధ్యాయులకు సన్మానం చెసిన బొల్లారం సీఐ సుధీర్ కుమార్

పటాన్ చేరు : సెప్టెంబర్ 5 (ప్రజావీక్షణం)

టీచర్స్ డే సందర్భంగా ఉపాధ్యాయులకు ఐడిఎ బొల్లారం సీఐ సుధీర్ కుమార్ సన్మానం చెసి టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.టీచర్స్ డే సందర్భంగా బొల్లారం డివిజన్ పరిధిలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో టీచర్స్ డే సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లారం సీఐ సుధీర్ కుమార్ హాజరై జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రాధనోపాద్యాయుడు మంగీలాల్, సీనియర్ ఉపాధ్యాయులు విక్టోరియా కి సన్మానం చేసారు.డాక్టర్ సర్వే పల్లి రాధాకృష్ణ జన్మదినాన్ని పురష్కరించుకుని దేశ వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటామని సీఐ సుధీర్ కుమార్ విద్యార్థులకు తెలిపారు.మన భారతీయ సంప్రదాయంలో తల్లిదండ్రుల తర్వాత అత్యంత పూజనీయంగా భావించే వ్యక్తి గురువు. 'ఆచార్యదేవోభవ' అంటూ విద్యాబుద్ధులు నేర్పిన గురువులను కీర్తిస్తాం. నిజం చెప్పుకోవాలంటే.. మన తల్లిదండ్రుల కంటే గురువులకే మన గురించి ఎక్కువ తెలుసనడంలో ఎలాంటి సందేహం లేదు. మన తెలివితేటలు, ఆలోచనల గురించి గురువులకే పూర్తిగా తెలుస్తుంది. చదువు మీద శ్రద్ధ తగ్గినట్టనిపించినా.. మనసు పక్కదారి పట్టినట్టు గుర్తించినా దండిస్తారు. సరైన దారిలో నడిపిస్తారు. అందుకే గురువును మించిన దైవం లేదంటారు అని సీఐ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# కాజిపల్లిలో టిప్పర్ల బీభత్సం.. మరో ప్రాణం బలి

## బైక్‌ను ఢీకొన్న కంకర టిప్పర్.. అక్కడికక్కడే వ్యక్తి మృతి

## క్రెషర్ల వద్ద వరుస ప్రమాదాలు.. అధికారులు ఎప్పుడు మేల్కొంటారు

పటాన్ చేరు : సెప్టెంబర్ 5 (ప్రజావీక్షణం)

కాజిపల్లి కంకర క్రెషర్ల నుంచి రాకపోకలు సాగిస్తున్న కంకర టిప్పర్లు వాహనదారుల పాలిట మృత్యుశకటాలుగా మారుతున్నాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంగారెడ్డి జిల్లా కాజిపల్లి కంకర క్రెషర్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కంకర టిప్పర్ లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. టిప్పర్ టైరు మృతుడిపై నుంచి వెళ్లడంతో మృతదేహం తీవ్రంగా ఛిద్రమై, ముఖం గుర్తుపట్టలేని స్థితికి చేరుకుంది.కాజిపల్లి క్రెషర్ పరిధిలో భారీ టిప్పర్ లారీల రాకపోకలు పెరుగుతున్నప్పటికీ, వాటి వేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, రహదారి భద్రతపై సంబంధిత అధికారులు తగిన స్థాయిలో దృష్టి సారిస్తున్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా శాశ్వత పరిష్కారం ఎందుకు కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ప్రమాదం జరిగిన ప్రతిసారీ బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారా? లేక వివిధ కారణాలతో వ్యవహారాలు రాజీ దిశగా వెళ్తున్నాయా? అనే ఆరోపణలపై కూడా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఒక ప్రాణం పోయిన తర్వాత స్పందించడం కంటే ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత అని గ్రామస్తులు అంటున్నారు.టిప్పర్ లారీల వేగ నియంత్రణ, డ్రైవర్ల నిబంధనల పాటింపు, వాహనాల ఫిట్‌నెస్‌తో పాటు క్రెషర్ యాజమాన్యాల భద్రతా చర్యలపై అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. ఇకనైనా సంబంధిత శాఖలు స్పందించి కాజిపల్లి క్రెషర్ వద్ద జరుగుతున్న ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



# అధ్యాపక బృందానికి లైన్స్ క్లబ్ సన్మానం

కమాన్‌పూర్, సెప్టెంబర్ 5:

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కమాన్‌పూర్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం కమాన్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందాన్ని ఘనంగా సత్కరించారు. అధ్యాపకులను శాలువాలతో సన్మానించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రమేష్, లైన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్ విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం, విద్యారంగానికి ఆయన చేసిన సేవలను వివరించారు. రాధాకృష్ణన్ గొప్ప తత్వవేత్త, విద్యావేత్తగా దేశానికి విశిష్ట సేవలందించారని తెలిపారు. భారత తొలి ఉపరాష్ట్రపతిగా, రెండో రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించిన ఆయన, విద్యకు సమాజాభివృద్ధిలో అత్యంత ప్రాధాన్యం ఉందని విశ్వసించారని పేర్కొన్నారు. ఆయన జయంతి అయిన సెప్టెంబర్ 5ను ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం గురువుల పట్ల సమాజం చూపుతున్న గౌరవానికి ప్రతీక అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, జ్ఞానాన్వేషణ, నైతిక విలువలను అలవర్చుకుని ఉన్నత లక్ష్యాల వైపు ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమేష్, లైన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఆరోగ్యానికి క్రీడలు అవసరం

## - జిఎం పర్సనల్ వెల్ఫేర్ అజయ్ కుమార్

## - ఘనంగా క్రీడా పోటీలు ప్రారంభం

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 5(ప్రజా వీక్షణం):

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సింగరేణి జిఎం పర్సనల్ వెల్ఫేర్ అజయ్ కుమార్ అన్నారు. కార్పోరేట్ ఏరియా డబల్యూపిఎస్ అండ్ జిఏ ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెం సిఈఆర్ క్లబ్ నందు డిపార్ట్మెంటల్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిఎం వెల్ఫేర్ అజయ్ కుమార్ ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి సంస్థ క్రీడలను ఎంతగానో ప్రోత్సహిస్తుందని ఇందులో మంచి క్రీడా ప్రతిభతో స్నేహభావంతో క్రీడలలో రాణించాలని సూచించారు. క్రీడలు అనేవి శారీరక దృఢత్వానికి ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. క్రీడా పోటీల కొరకు సింగరేణి సంస్థ ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఉద్యోగులు తమ తమ పనులను నిర్వహిస్తూనే క్రీడలలో ఆసక్తి చూపడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు అందరూ తమ ఫిట్ నెస్ ను కాపాడుకుంటూ నిరంతరం సాధన చేస్తూ పతకాలు సాధించాలనే దృఢ సంకల్పంతో కోల్ ఇండియా స్థాయి పోటీలలో పాల్గొని మన సంస్థ మరిన్ని పతకాలు సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఇందులో భాగంగా మొదటి ఆటగా బాస్కెట్ బాల్ మ్యాచ్ ను హెడ్డాఫీస్ వర్సెస్ ఎస్ అండ్ పిసి డిపార్ట్ మెంట్ గ్రూప్ మధ్య నిర్వహించగా హెడ్ ఆఫీస్ జట్టు విజయం సాధించింది.ఈ కార్యక్రమంలో డిజిఎం(పర్సనల్) వెల్ఫేర్ బి.శివ కేశవరావు, గుర్తింపు సంఘం (ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం(ఐఎన్‌టియూసి) కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ఎస్.పితాంబర రావు, కార్పొరేట్ సిఎంఓఏఐ జాయింట్ సెక్రటరీ కె.కమలాకర్, డివైపిఎం వి.అనీల్ కుమార్, డివైపిఎం అండ్ హానరీ సెక్రెటరీ కే.సునీల్ కుమార్, స్పోర్ట్స్ సూపర్ వైజర్ ఎంసి.పోస్ నెట్, వెల్ఫేర్ పిఏ కే.వరప్రసాద రావు, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ సిహెచ్.రమేష్, బాస్కెట్ బాల్ కెప్టెన్ అరుణ్, బాస్కెట్ బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.




# బొల్లారంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై ACP పరిశీలన.

పటాన్ చేరు : సెప్టెంబర్ 5 (ప్రజావీక్షణం)

ఈనెల 14 నుండి ప్రారంభం కానున్న వినాయక ఉత్సవాలు నిర్వహణ అనంతరం గణేష్ విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్లపై అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ట్రాఫిక్ మియాపూర్ శ్రీ ఆది మూర్తి ూజూ గారు, బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీ సుధీర్ గారు, శ్రీ నరసింహారెడ్డి జ× ట్రాఫిక్ మియాపూర్ గారు, బొల్లారం అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్రీ నరసింహులు గారు, మెడికల్ ఆఫీసర్ శ్రీ మహేష్ గారు, విద్యుత్ ూజు శ్రీ నరేందర్ గారు, మరియు సానిటరీ ఇన్స్పెక్టర్ వినోద్ గార్లతో కలిసి మాధవోనికుంట బొల్లారం ను సందర్శించి వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. మాధవని కుంట వినాయక నిమజ్జన ఘాట్ దగ్గర మున్సిపల్ శాఖ తరపున క్రేన్, ట్రాక్టర్లు, లైటింగ్, టెంట్లు/ వివిధ స్టాల్స్, కుర్చీలు, త్రాగునీరు, నిమజ్జనానికి పారిశుద్ధ్య సిబ్బంది ఏర్పాటు చేయడం, పాట్ హోల్స్ ఫిల్లింగ్, పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టడం జరుగుతుందని, వైద్యశాఖ తరపున వైద్య సిబ్బందితో అత్యవసర చికిత్స నిమిత్తం ఖీఱతీర్ ూఱఅ సదుపాయం ఏర్పాట్లు, విద్యుత్ శాఖ తరపున నిరంతర విద్యుత్ సరఫరా, ప్రమాదాల నివారణకు సిబ్బంది ఏర్పాట్లు, పోలీస్ శాఖ మరియు రెవెన్యూ శాఖల సమన్వయంలో శాంతి భద్రతలు కాపాడటం, అగ్నిమాపక శాఖ ద్వారా అగ్నిమాపక ప్రమాదాలు జరగకుండా వాహనాలు మరియు సిబ్బంది ఏర్పాటు, ట్రాఫిక్ పోలీస్ విభాగం తరపున ట్రాఫిక్ అంతరాయం కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని శ్రీ ఆది మూర్తి ూజూ ట్రాఫిక్ గారు మరియు అన్ని శాఖల అధికారులు తెలియజేశారు. ఈరోజే మాధవోనికుంటలో పేరుకుపోయిన చెత్తా చెదారం, కలుపు మొక్కలు, గడ్డి, ప్లాస్టిక్ కవర్లు మొదలగునవి తొలగించే పనులు ప్రారంభించడం జరిగిందని ూవీజ ఙ సానిటరీ ఇన్స్పెక్టర్ తెలియజేశారు. ఈ సంవత్సరం వర్షాలు చాలా తక్కువగా కురిసినందున ఇతర చెరువులలో నీటి కొరత దృష్ట్యా కేవలం ఒకే కుంటలో నిమజ్జనం ఏర్పాట్లు చేయడం జరిగిందని మరియు పట్టణ భక్తులు/ ప్రజలంతా సహకరించి వినాయక ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన అనుమతులు మరియు జాగ్రత్తలు తీసుకోవాలని ACP గారు పిలుపునిచ్చారు.అనంతరం ITC కంపెనీ ముందు కరెంట్ సబ్ స్టేషన్ మూలన ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యాల గురించి క్షేత్ర పరిశీలన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



# ప్రజావీక్షణం
దినపత్రిక

06 ఆదివారం సెప్టెంబర్ 2026

GENERAL NEWS

www.prajaveekshanam.in


## ఉపాధ్యాయుల మాట వినండి.. జీవితానికి బంగారు బాట వేసుకోండి

### నేటి విద్యార్థులే.. రేపటి ఐఏఎస్, ఐపీఎస్‌లు, ప్రజాప్రతినిధులు

### గంజాయి సమాచారం కోసం 1908.. సైబర్ మోసాలకు 1930.. అత్యవసర పరిస్థితుల్లో 112

**ప్రజా వీక్షణం , గోదావరిఖని :**

విద్యార్థులు ఉపాధ్యాయుల మాటకు గౌరవం ఇస్తూ,వారి సూచనలు పాటించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు.చెడు వ్యసనాలకు, ముఖ్యంగా గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జోన్‌లోని ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఎన్టీపీసీ టీటీఎస్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఉపాధ్యాయ దినోత్సవ ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రామగుండం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణకుమార్,సైబర్ నేరాల విభాగం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో తల్లిదండ్రులే తొలి గురువులని,వారి తర్వాత ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులు జీవితంలో ఏ స్థాయికి ఎదిగినా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఎల్లప్పుడూ గౌరవించే మనస్తత్వాన్ని కలిగి ఉండాలని సూచించారు. చదువు,వ్యక్తిగత జీవితం లేదా ఇతర అంశాలకు సంబంధించి ఏవైనా సమస్యలు, సందేహాలు ఉంటే వాటిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పంచుకోవాలని తెలిపారు. సమస్యలను మనసులో దాచుకోకుండా వారితో మాట్లాడితే సరైన మార్గనిర్దేశం లభిస్తుందని అన్నారు.విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం వారి భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గంజాయి విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1908కు తెలియజేయాలని సూచించారు.సైబర్ నేరాల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు



అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింకులను తెరవకూడదని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు,ఓటీపీ వంటి సమాచారాన్ని ఎవరికీ వెల్లడించకూడదని తెలిపారు.సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.అత్యవసర పరిస్థితులు, ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు లేదా ఇతర ఆపద సమయాల్లో పోలీసుల సహాయం కోసం 112కు కాల్ చేయాలని విద్యార్థులకు వివరించారు. గతంలో అందుబాటులో ఉన్న 100 నంబర్ స్థానంలో ప్రస్తుతం 112 అత్యవసర సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.విద్యార్థుల భద్రత కోసం పోలీసు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని సీపీ పేర్కొన్నారు. ఏసీపీలు,సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు పాఠశాలల పరిసరాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ భద్రతా పరిస్థితులను పరిశీలిస్తున్నారని తెలిపారు.అయితే విద్యార్థులే తమ భద్రతకు తొలి రక్షకులని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకోవాలని, భవిష్యత్తులో ఐఏఎస్,ఐపీఎస్ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని సీపీ ఆకాంక్షించారు.వినాయక చవితిని పురస్కరించుకుని తెలంగాణ సైబర్ భద్రతా విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన "వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు" అనే అవగాహన పోస్టర్‌ను సీపీ అంబర్ కిషోర్ ఝా, డీసీపీ బి.రామ్‌రెడ్డి ఆవిష్కరించారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వినూత్న రీతిలో వివరిస్తూ ఈ పోస్టర్‌ను రూపొందించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, రామగుండం సీఐ కృష్ణకుమార్, ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, బసంత్‌నగర్ ఎస్ఐ శ్రీధర్,రామగుండం ఎస్ఐ సంధ్యారాణి, అంతర్గాం ఎస్ఐ వెంకట్,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.జయరాజ్, స్థానిక కార్పొరేటర్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కేటీఆర్ ముందుగా సమాధానం చెప్పాలి

### సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**కరీంనగర్ సెప్టెంబర్ 05( ప్రజా వీక్షణం )**

ఫీజ్ రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ అంశాలపై మాట్లాడేందుకు కరీంనగర్ వస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ముందుగా తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అంశాలపై సమాధానం చెప్పాలని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. 2023 డిసెంబర్ 3 నాటికి రూ.5 వేల కోట్ల ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎందుకు పేరుకుపోయాయో చెప్పాలని ప్రశ్నించారు. ఇంటర్ ఫలితాల తప్పిదాలు, గ్రూప్ పరీక్షల లీకేజీలు, నిరుద్యోగుల సమస్యలు, ఎన్నికల్లో ఇచ్చిన ఇంటికో ఉద్యోగం హామీ, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య హామీ అమలు కాకపోవడంపై కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విశ్వవిద్యాలయాలకు పూర్తిస్థాయి వీసీలను ఎందుకు నియమించలేదని, ఇన్‌చార్జి వీసీలతోనే ఎందుకు నిర్వహించారో స్పష్టం చేయాలని కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కోరారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పిన తర్వాతే ఫీజ్ రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ అంశాలపై మాట్లాడాలని ఆయన అన్నారు.




## కొత్తపల్లి భక్తాంజనేయ స్వామికి కదలి, ఫలాలతో ప్రత్యేక పూజలు...

**జమ్మికుంట, ప్రజా వీక్షణం సెప్టెంబర్ 4...**

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో శ్రావణ మాసం చివరి శనివారం రోజున శ్రీ భక్తాంజనేయ స్వామి వారికీ కదలి ఫలాల(అరటి పండ్లు)తో ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు రామ చంద రావు, నిర్వహించారు. భక్తులు తీసుకు వచ్చిన 2 వేల అరటిపండ్లతో స్వామివారికి ఆకర్షణీయంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.. .



## కృష్ణవేణి పాఠశాలల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

### 15 ఏళ్లుగా విశిష్ట సేవలందించిన ఉపాధ్యాయులకు ఎక్సలెన్సీ సర్వీస్ అవార్డ్ తో ఘన సత్కారం

**ప్రజా వీక్షణం ,గోదావరిఖని :**

గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం మరియు ఎన్టీపీసీ పరిసర ప్రాంత ప్రజల ఆదరాభిమానాలను చూరగొంటూ విద్యారంగంలో తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్న కృష్ణవేణి పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి వివిధ తరగతులను నిర్వహిస్తూ, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయుల బాధ్యతలను స్వయంగా నిర్వర్తించడం ద్వారా నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, బాధ్యత, ఆత్మవిశ్వాసం, సమయపాలన వంటి విలువలను విద్యార్థులు అనుభవపూర్వకంగా నేర్చుకున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేలా ఈ స్వయం పరిపాలన దినోత్సవం ఎంతో ఆసక్తికరంగా సాగింది.

**15 ఏళ్ల సేవకు ఘన గౌరవం**

పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో 15 సంవత్సరాలుగా తమ విలువైన సేవలను అందిస్తున్న ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం ఎక్సలెన్సీ సర్వీస్ అవార్డు తో ఘనగా సత్కరించింది. ఈ సందర్భంగా వారికి మెమెంటోలు, శాలువాలతో సన్మానం చేసి వారి సేవలను అభినందించారు."దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే"ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, సమాజానికి దిశానిర్దేశం చేసే ఉపాధ్యాయులను గౌరవించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు."నేటి విద్యార్థులే రేపటి పౌరులు. ఆ పౌరులను సన్మార్గంలో నడిపించడంతో పాటు, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తర బాధ్యత ఉపాధ్యాయులపై




ఉంది. విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడం మాత్రమే కాకుండా, వారిలో మానవీయ విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత ఆలోచనా విధానాన్ని పెంపొందించడం ఉపాధ్యాయుల ప్రధాన కర్తవ్యం" అని అన్నారు.

**ఉపాధయులను సత్కరించడం గర్వంగా ఉందని ఆయన పేర్కొన్నారు.**

పాఠశాల కరెస్పాండెంట్ మంజుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు."విద్యార్థుల్లో క్రమశిక్షణ, విలువలు, జ్ఞానం, దేశభక్తి, సేవాభావం వంటి సద్గుణాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనది. ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థి జీవితాన్నే కాదు... ఒక కుటుంబాన్ని, ఒక సమాజాన్ని, చివరకు ఒక దేశ భవిష్యత్తును మార్చగలడు" అని అన్నారు.ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, కృష్ణవేణి పాఠశాలల అభివృద్ధిలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను ఆమె అభినందించారు.ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులు తమ అనుభవాలను పంచుకోగా, విద్యార్థులు ఉపాధ్యాయుల పట్ల తమకున్న గౌరవం, అభిమానాన్ని వ్యక్తం చేశారు. పాఠశాల ప్రాంగణమంతా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు, అభినందనలు, ఆనందోత్సాహాలతో సందడిగా మారింది.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## భూ రీ-సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్.

**జయశంకర్ భూపాలపల్లి. ప్రజా వీక్షణం , సెప్టెంబర్ 05:**

గణపురం మండలం అప్పయ్యపల్లి గ్రామపంచాయతీ శివారులోని తూపురం వద్ద జరుగుతున్న భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే అధికారులు, సిబ్బందితో మాట్లాడిన కలెక్టర్ రీ-సర్వే పనుల పురోగతిని, అనుసరిస్తున్న సర్వే విధానాన్ని పరిశీలించారు. అనంతరం రైతులను సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు.భూ రీ-సర్వేను ఖచ్చితత్వంతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రీ సర్వే కోసం ఎంపిక చేసిన 70 గ్రామాలలో సర్వే చేపట్టాల్సి ఉండగా ఇప్పటి వరకు 12 గ్రామాల్లో రీ సర్వే జరుగుతున్నదని, మిగిలిన గ్రామాల్లో కూడా సర్వే చేపట్టాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న సర్వేయర్ల భద్రతకు అవసరమైన గమ్ షూస్, ఇతర రక్షణ పరికరాలను కొనుగోలు చేయాలని ఆదేశించారు.అలాగే రోవర్ తదితర ఆధునిక సాంకేతిక పరికరాలను సమర్థవంతంగా వినియోగిస్తూ సర్వే పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. గన్ పూర్ మండలంలో 6 గ్రామాలను రీ సర్వే కోసం ఎంపిక చేయగా ప్రస్తుతం 3 గ్రామాల్లో రీ సర్వే జరుగుతుందని తెలిపారు. భూ రీ-సర్వే అనంతరం ప్రతి రైతుకు వారి భూమికి సంబంధించిన స్పష్టమైన భూధార్ సంఖ్య, భూ మ్యాపులు అందుతాయని, దీనివల్ల భూ రికార్డులు మరింత పారదర్శకంగా మారడంతో పాటు భూ వివాదాల పరిష్కారానికి దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఎన్నో సంవత్సరాలు తరువాత భూములు రీ సర్వే జరుగుతున్నదని, రైతులు సర్వే సిబ్బందికి సహకరించాలని తెలిపారు. రీ-సర్వే ప్రక్రియలో రైతులకు పూర్తి అవగాహన కల్పిస్తూ, వారి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి కుసుమ కుమారి, ఆర్డిఓ హరికృష్ణ, తహసీల్దార్ రాజేశ్వర రావు రైతులు తదితరులు పాల్గొన్నారు.

**అప్పయ్యపల్లి రైతు కొప్పుల యాకయ్య మాట్లాడుతూ..**

భూ సమస్యల పరిష్కారం కోసం గతంలో కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ భూ రీ-సర్వే ప్రక్రియతో అధికారులే తమ గ్రామాలకు, తమ భూముల వద్దకు వచ్చి సర్వే నిర్వహించడం ఎంతో సంతోషంగా



ఉందని హర్షం వ్యక్తం చేశారు.అప్పయ్యపల్లి గ్రామపంచాయతీ శివారు పరిధిలోని తూపురం వద్ద జరుగుతున్న డిజిటల్ భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ క్షేత్రస్థాయిలో పరిశీలించిన సందర్భంగా రైతు యాకయ్య తన అభిప్రాయాన్ని వెల్లడించారు. గతంలో మా భూములకు సంబంధించిన సమస్యలు, భూ రికార్డుల్లో ఏవైనా ఇబ్బందులు ఉంటే వాటి పరిష్కారం కోసం రెవెన్యూ అధికారుల కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు పరిస్థితి మారిందని, అధికారులే మా గ్రామానికి వచ్చి, మా భూముల వద్దే సర్వే చేస్తున్నారని తెలిపారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి భూముల కొలతలు చేపట్టడం, భూ వివరాలను డిజిటల్‌గా నమోదు చేయడం వల్ల భూ రికార్డుల్లో స్పష్టత ఏర్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి రైతు భూమికి సంబంధించిన హద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలు కచ్చితంగా నమోదైతే భవిష్యత్తులో భూ తగాదాలు తగ్గడంతో పాటు భూములకు సంబంధించిన సమస్యలు త్వరగా పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అధికారుల వద్దకు మేము వెళ్లడం కాకుండా.. అధికారులే మా వద్దకు వచ్చి మా భూములను పరిశీలించి సర్వే చేయడం రైతులకు ఎంతో ఉపయోగకరమని, మా భూములకు సంబంధించిన వివరాలు స్పష్టంగా నమోదై, భూధార్ సంఖ్య, మ్యాప్ అందితే భవిష్యత్తులో మాకు మరింత భరోసా ఉంటుందని, ప్రభుత్వం చేపట్టిన ఈ రీ-సర్వే కార్యక్రమం రైతులకు ఎంతో మేలు చేస్తుందని యాకయ్య మరికొందరు పేర్కొన్నారు.డిజిటల్ భూ రీ-సర్వే ద్వారా భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, కచ్చితత్వం పెరగడంతో పాటు రైతులకు తమ భూములపై స్పష్టమైన హక్కులు, వివరాలు అందుబాటులోకి వస్తాయని ఆయన అన్నారు.

## ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక కానుక అందజేసిన గంగాధర సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న

**చొప్పదండి ని.వ గంగాధర మండలం సెప్టెంబర్ 5, ప్రజా వీక్షణం**

కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రానికి సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుని తన నిజాయితీని చాటుకున్నారు. సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలోని ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన మాట ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గంగాధరకు చెందిన వేముల శంకరమ్మ- కీ.శే.రవీందర్ కుమార్తె సోని వివాహాన్ని పురస్కరించుకుని శుక్రవారం సోని వివాహానికి హాజరైన సర్పంచ్ దంపతులు రూ.10,116 నగదును పెళ్లి కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే తమ లక్ష్యమని, గ్రామ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. పేద కుటుంబాల ఆడబిడ్డల పెళ్లిళ్లకు తమ వంతు అండగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల హామీని గుర్తుపెట్టుకుని మరీ సహాయం చేసిన సర్పంచ్ ఉదారతపై శంకరమ్మ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చొప్పదండి ప్యాక్స్ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి,గంగాధర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంత్రి మహేందర్,మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ,ఉపసర్పంచ్ గాలిపెల్లి శ్రీనివాస్,వార్డ్ సభ్యులు గంట కిషన్,చిందం రాజు,కట్ల వసంత నారాయణ, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



GENERAL NEWS
12
06 ఆదివారం సెప్టెంబర్ 2026
www.prajaveekshanam.in
ప్రజావీక్షణం
దినపత్రిక

# కూరగాయల సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించాలి

## తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించవచ్చు

## మల్చింగ్, డ్రిప్, స్ప్రింక్లర్ వినియోగంపై రైతులకు అవగాహన

తాండూరు: ప్రజా వీక్షణం

రైతులు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించాలని ఉద్యాన శాఖ అధికారులు సూచించారు.తాండూరు మండలం కొత్తపల్లి రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో ఉద్యాన శాఖ ద్వారా రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కూరగాయల సాగు, పంటల యాజమాన్య పద్ధతులు, నీటి వినియోగం, ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా బెల్లంపల్లి ఉద్యాన శాఖ అధికారిణి అర్పన మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులు శాస్త్రీయ పద్ధతుల్లో కూరగాయల సాగు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా మల్చింగ్, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ వంటి ఆధునిక పద్ధతులను వినియోగించడం ద్వారా నీటి వృథాను అరికట్టి, తక్కువ నీటితో పంటలను సమర్థవంతంగా సాగు చేయవచ్చని తెలిపారు.మల్చింగ్ పద్ధతి ద్వారా నేలలో తేమ ఎక్కువ కాలం నిలిచి ఉండటంతో పాటు కలుపు మొక్కల నియంత్రణకు కూడా ఉపయోగపడుతుందని వివరించారు. డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతుల ద్వారా పంటకు అవసరమైన నీటిని సమర్థవంతంగా అందించడంతో నీటి పొదుపుతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలిపారు.అదేవిధంగా కూరగాయల సాగు చేపట్టే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా వివిధ పథకాల కింద సబ్సిడీ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని అర్పన వివరించారు. అర్హత కలిగిన రైతులు ఈ సబ్సిడీ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మండల వ్యవసాయ అధికారిణి కె. సుష్మా రైతులకు ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. పంటకు అవసరమైన పోషకాలను గుర్తించి, భూసారానికి అనుగుణంగా ఎరువులను సరైన మోతాదులో, సరైన సమయంలో వినియోగించాలని సూచించారు. అధికంగా ఎరువులు వినియోగించడం వల్ల సాగు ఖర్చులు పెరగడంతో పాటు నేల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వివరించారు.రైతులు వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు సూచించే శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ సాగు చేపట్టాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేశ్, ఎంపిడి శ్వేత రాణి, కొత్తపల్లి గ్రామ సర్పంచ్ వెంకటేష్, మ్యాట్రిక్స్ ఎఫ్ఈ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయులే భావితరాలకు బాటసారులు

## ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నే రవి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ( ప్రజా వీక్షణం ) సెప్టెంబర్: 05

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నే రవి దేశవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటామని ఆయన పేర్కొన్నారు.




ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు బోధించే వ్యక్తి మాత్రమే కాదని, విద్యార్థి జీవితానికి దిశానిర్దేశం చేసే మార్గదర్శి అని కర్నే రవి అన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యత, సమాజం పట్ల సేవాభావాన్ని విద్యార్థుల్లో పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు."తల్లిదండ్రులు పిల్లలకు జీవితాన్ని అందిస్తే.. ఉపాధ్యాయులు ఆ జీవితానికి సరైన మార్గాన్ని చూపిస్తారు" అని ఆయన పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించే శక్తి ఉపాధ్యాయులకు ఉందన్నారు.ఒక మంచి ఉపాధ్యాయుడు వందలాది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేయగలడని, ఉపాధ్యాయుల సేవలను సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని కర్నే రవి అన్నారు.సెప్టెంబర్ 5 కేవలం ఒక వేడుక రోజు మాత్రమే కాదని, ఉపాధ్యాయుల జ్ఞానం, త్యాగం, సేవ, మార్గదర్శకత్వానికి కృతజ్ఞతలు తెలిపే ప్రత్యేకమైన రోజని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ప్రతి ఒక్క ఉపాధ్యాయుడికి హృదయపూర్వక ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసిన ఎక్సైజ్ అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ( ప్రజా వీక్షణం ) సెప్టెంబర్: 05

మణుగూరు ఎక్సైజ్ స్టేషన్‌కు నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎక్సైజ్ సీఐ కే. నాగేశ్వరరావు, ఎక్సైజ్ విజయ్ భాస్కర్ శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు ఎమ్మెల్యే పాయం. వెంకటేశ్వర్లుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. మణుగూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో చట్టపరమైన నిబంధనల అమలు, అక్రమ మద్యం, గంజాయి తదితర అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై పరస్పరం చర్చించినట్లు సమాచారం.నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ, ఎస్సైలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ మోసపూరిత పాలనపై ములుగు బీఆర్ఎస్ భారీ రణభేరి

## నూగూరు వెంకటాపురంలో 200 బైక్‌లతో నిరసన ర్యాలీ

ములుగు ప్రజా వీక్షణం ప్రతినిధి :

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు అమలు కాకపోవడాన్ని నిరసిస్తూ శనివారం ములుగు జిల్లా వెంకటాపురం మండలం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గంప రాంబాబు, పార్టీ సీనియర్ నాయకులు నరసింహమూర్తి ఆధ్వర్యంలో సుమారు 200 బైక్‌లతో నిరసన ర్యాలీ స్థానిక వీధుల్లో చేపట్టారు.బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు వెంకటాపురం మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీతో హోరెత్తించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు."అలవిగాని హామీలతో నమ్మించి, అధికార పీఠం ఎక్కిన తర్వాత ప్రజలను విస్మరించారు. ఇంతకుముందు ఒక లెక్క.. ఇప్పుడు ఒక లెక్క! కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదు. నెరవేర్చకపోతే గద్దె దింపుతాం" అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఆరు గ్యారెంటీలను పాతరేసి, 420కు పైగా హామీలను బొందపెట్టిందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలన ప్రజా కంటకంగా మారిందని, రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులను నమ్మించి గొంతు కోశారని విమర్శించారు.ప్రతి హామీ నెరవేరే వరకు ప్రజల తరఫున బీఆర్ఎస్ పోరాటం ఆగదని, వీధి వీధినా కాంగ్రెస్ నయవంచనను ఎండగడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య, వాజేడు మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, కాకులమర్రి ప్రదీప్ రావు, తుమ్మ మల్లారెడ్డి, తాటి కృష్ణ, ఎండి వలి బాబా, ఎండి ఖాజా పాషా, తాడూరి రఘు తదితర నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బి సి గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుకు సన్మానం

చొప్పదండి ని.వ గంగాధర మండలం సెప్టెంబర్ 5, ప్రజా వీక్షణం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర పాఠశాల మరియు కళాశాలలో శ్రీ సర్వేపల్లి రాధా కిషన్ జన్మదినం సందర్భంగా ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రిన్సిపల్ సురేష్ కుమార్ బొజ్జ మాట్లాడుతూ ఉపాధ్యాయుని యొక్క వృత్తి చాలా గొప్పదని మరియు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే సత్తా ఒక ఉపాధ్యాయునికి మాత్రమే ఉందాలని తెలియజేశారు. భారత దేశ అభివృద్ధి విద్యార్థి యొక్క భవిష్యత్తుపై ఆధారపడి ఉంటుందని తెలియజేశారు. ఈ సమాజంలో ఉపాధ్యాయుని యొక్క పాత్ర కీలకమైందని దేశ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించేది ఉపాధ్యాయుడు మాత్రమే అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కైలాసం రాజు, వరుణ్ జ్యోతి, అంజయ్య, సత్యనారాయణ, శ్రావణ్ కుమార్,సంపత్, ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి,వంశీకృష్ణ, జై సింగ్,విశ్వకర్మ, మల్లేశం, మంగ రాణి,ప్రసన్న, రమేష్,హేమశ్రీ తదితరులు పాల్గొన్నారు.



# బదిలీ పై వెళ్తున్న అధికారికి ఆత్మీయ సన్మానం

కమాన్ పూర్ ప్రజా వీక్షణం సెప్టెంబర్ ఐదు.

రామగుండం–3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా లో సివిల్ డి.జి.యం గా విధులు నిర్వహిస్తూ కొత్తగూడెం ఏరియా కు బదిలీ పై వెళ్తున్న బి.రాజేంద్ర కుమార్ ను రామగుండం–3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, వివిధ విభాగాల అధిపతులు శనివారం జిఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరియాలో విధేయతతో, అంకిత భావంతో వారు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్ వి ఫ్యాటింగ్, విభాగాధిపతులు బి.టి.మురళీ కృష్ణ, కె.ఐలయ్య , షబ్బీరుద్దీన్, సి.జె.సురేఖ, ఆర్.రాజేశ్వరి, అఫ్సర్ పాషా, రవిచరణ్, ఆసిఫ్ యాసిన్, జ్ఞానసంబంధన్, ప్రకాష్ , డిప్యూటీ పియం యం డి.ఆసిఫ్, సీనియర్ పిఓ టి.ప్రీతి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఈనెల 9న హుండీ లెక్కింపు.

కమాన్ పూర్ ప్రజా వీక్షణం సెప్టెంబర్ 5.

కమాన్ పూర్ మండల కేంద్రంలోని శ్రీ ఆదివార స్వామి ఆలయ హుండీ లెక్కింపు ఈ నెల 9న నిర్వహించడం జరుగుతుందని ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్ ఆలయ ఈవో కొసనకంతారెడ్డి తెలిపారు. ఇటీవల స్వామి వారి జయంతి ఉత్సవాలతో పాటు నిత్యం భక్తులు వేసిన హుండీలో కొన్ని ఆదాయాన్ని లెక్కించుట గాను ఈ నెల 9 అనగా బుధవారం రోజున ఉదయం 10 గంటలకు స్వామివారి కళ్యాణమంటపంలో హుండీ లెక్కింపు నిర్వహించడం జరుగుతుందని కావున పోలీస్ శాఖ రెవెన్యూ శాఖ మరియు పంచాయతీరాజ్ శాఖ తోపాటు వివిధ ప్రజాప్రతినిధులు పార్టీల నాయకులు హాజరుకావాలని కోరారు.



# ఖని సింగరేణి ఏరియా అస్పత్రిలో డయాలసిస్ బెడ్స్ పెంచాలి

## సింగరేణి సీఎండి కి వినతిపత్రం అందజేసిన స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు

ప్రజా వీక్షణం , గోదావరిఖని:

గోదావరిఖని ఏరియా అస్పత్రిలో రోగులకు సరిపడే డయాలసిస్ యూనిట్లు సరిపోక కార్మికులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సింగరేణి అస్పత్రికి శనివారం రోజున సిఎండి డాక్టర్ కిరణ్ రాజ్ వచ్చిన సందర్భంగా స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక అధ్యక్షులు లిఖించి శివ గౌరవ అధ్యక్షులు మద్దెల దినేష్ కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు.అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా గోదావరిఖని, భూపాలపల్లిలో మాత్రమే డయాలసిస్ యూనిట్లు ఉన్నాయని, బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, 8వ కాలనీ,



సెంటినరీ కాలనీ ల నుండి ప్రతిరోజూ వందలాది కిడ్నీ పేషెంట్లు వస్తున్నా, ఉన్న 5 మిషన్లు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 12 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన డయాలసిస్ యంత్రాలు తరచూ రిపేర్ కావడం వల్ల పేషెంట్లు అనేక అవస్థలు పడుతున్నారని సి ఎం డి దృష్టికి తీసుకెళ్లారు. పారిశ్రామిక కాలుష్యం వల్ల కిడ్నీ వ్యాధులకు గురవుతున్న కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు సరైన నాణ్యతమైన వైద్యం అందించడం యాజమాన్య బాధ్యత అని పేర్కొన్నారు.గుండె జబ్బులకు ట్రీట్మెంట్ ఇవ్వొచ్చు కానీ డయాలసిస్ చేయించుకోకపోతే కిడ్నీ పేషెంట్లు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.అర్జీ –1 లోని గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పిటల్ లో డయాలసిస్ బెడ్స్ మరియు మిషన్ల సంఖ్యను 10 వరకు పెంచాలని, 12 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పాత డయాలసిస్ యంత్రాలను వెంటనే మార్చాలని, సింగరేణి సి.ఎస్.ఆర్ నిధులు, డి.ఎం.ఎఫ్.టి నిధులను ఇతర ప్రాంతాలకు తరలించకుండా సింగరేణి కార్మికుల ఆరోగ్యం కోసం ఖర్చు పెట్టాలని కోరామన్నారు. సింగరేణి లో 40 ఏళ్ళుగా రక్తాన్ని చెమటగా మార్చి సంస్థకు కోట్లాది లాభాలు తెచ్చిన కార్మికుల ఆరోగ్యాలని నిర్లక్ష్యం చేయవద్దని, తక్షణమే దిగతంగా కార్మికుల, ఒ కుటుంబ సభ్యుల సౌకర్యార్థం కోరకు నూతన డయాలసిస్ యంత్రాలను అమర్చాలని కార్మికుల ప్రాణాలు కాపాడాలని కోరామన్నారు. అనంతరం సీఎండి మాట్లాడుతూ త్వరలో నూతన డయాలసిస్ యంత్రాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

# ప్రతి భూమికి హద్దులు నిర్ణయిస్తారు

## ఐదు రెవెన్యూ గ్రామాలలో పైలెట్ ప్రాజెక్టు

## తాహసీల్దార్ పర్శంది సుమన్

కమాన్ పూర్ ప్రజా వీక్షణం సెప్టెంబర్ 5.

గ్రామాలలోని ప్రతి భూమికి హద్దులు నిర్ణయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని రామగిరి తహసీల్దార్ పర్శంది సుమన్ అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ లో జరుగుతున్న భూమి రీ సర్వే కార్యక్రమాన్ని శనివారం స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమ పీతాంబరంతో కలిసి పరిశీలించారు. రామగిరి మండలంలో పన్నూరు గ్రామంలో భూముల సర్వే పూర్తి అయిందని తెలిపారు. రత్నాపూర్, మేడిపల్లి, లొంక కేసారం, బుధవారం పేట గ్రామాలలో సర్వే నిర్వహిస్తారని తెలిపారు. గ్రామ సరిహద్దులు, గ్రామ కంఠం, ప్రభుత్వ భూములు, పట్టా భూముల వివరాలు పొందుపరుస్తూ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. దీని కొరకు మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష లైసెన్స్ డ్ సర్వేయర్లను నియమించారని ఆయన తెలిపారు. రైతులు తమ వద్ద ఉన్న పాస్ బుక్కులను తీసుకొని మోఖ మీదికి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ జీపీఓ పెర్క వెంకటేశ్వర్లు, లైసెన్స్ డ్ సర్వేయర్లు ఈసారపు మహేందర్, పదాల కృష్ణ, స్థానిక నాయకులు పబ్బ మొగిలి, ఒద్దె సురేష్, జంగేటి కుమార్, అమరకొండ శ్రీనివాస్,కొండు వేణు తదితరులు పాల్గొన్నారు.



Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com